# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

/manamnews
www.manamnews.com

తిరుపతి | శనివారం • 1-4-2023 • సంపుటి:7 • సంచిక:86 • పేజీలు:8 • వెల:రూ.5

AMARAVATHI | ANANTHAPURAM | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM


పుష్య మాసం, గురువారం, తిథి : పంచమి సా.04.37 వరకు, నక్షత్రం: పుబ్బ ,మ:02.24 వరకు, వర్జ్యం: ఉ.10.16-12.00 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.33-11.17 వరకు, రాహుకాలం: మ.01.47-03.10 వరకు

## చిన్న మొత్తాల పొదుపు పథకాల వడ్డీ రేట్లు పెంపు

2




## భారత్‌కు కొత్త విదేశీ వాణిజ్య విధానం

2 లక్షల కోట్ల డాలర్ల ఎగుమతులే లక్ష్యం

2



# భవిష్యత్తు తరాలకూ ఉపయోగం

- 'జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష'కు అత్యంత ప్రాధాన్యం
- దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో సర్వే జరగడం లేదు
- అత్యంత సాంకేతిక పరిజ్ఞానం వినియోగం
- ఎవరూ టాంపరింగ్ చేయలేని విధంగా పత్రాలు
- సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి



అమరావతి, మార్చి 31 (మనం న్యూస్): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద స్థాయిలో సర్వే చేపట్టడం లేదని.. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకానికి అత్యంత ప్రాధాన్యత నిస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. ప్రజలకు అత్యంత ఉపయోగకరమైన కార్యక్రమం అని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎవరూ టాంపర్ చేయలేని విధంగా పత్రాలు అందిస్తున్నామన్నారు. ఇది ఇప్పటివారికే కాకుండా భవిష్యత్తు తరాలవారికీ కూడా చాలా ఉపయోగమని సీఎం పేర్కొన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు సర్వే ప్రక్రియను పూర్తిచేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.జాప్యానికి తావు లేకుండా కావాల్సిన సాంకేతిక పరికరాలను తెప్పించుకోవాలని సీఎం ఆదేశించారు. రెవెన్యూశాఖ పరిధిలో తొలి దశలో చేపట్టిన 2వేల గ్రామాల్లో సర్వే ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే చాలావరకు పత్రాల పంపిణీ జరుగుతోందని అధికారులు వివరించారు. మే 20 నాటికి సర్వే రాళ్లు వేసే పనితోపాటు అన్ని రకాలుగా సర్వే ప్రక్రియ పూర్తిచేయాలన్న సీఎం.. అవసరమైనంతమేర రోవర్లను ఆర్డర్ చేయాలని సూచించారు. దీనివల్ల అనుకున్న సమయానికే సర్వే ప్రక్రియ పూర్తవుతుందని సీఎం అన్నారు.అలాగే ప్రతి గ్రామ సచివాలయంలో సర్వేకోసం పరికరాలు ఉండాలన్న సీఎం.. రోవర్ తరహా... పరికరాలు తప్పకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. దీనివల్ల సర్వేయర్ పూర్తిస్థాయిలో తన పనిని పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరికరాలపై ఆలోచనలు చేయాలని సీఎం పేర్కొన్నారు. సర్వే పూర్తైన తర్వాత సరిహద్దులు వద్ద వేసేందుకు 31 లక్షల సర్వే రాళ్లను సిద్ధంచేశామని అధికారులు తెలిపారు. రోజుకు 50 వేల సర్వే రాళ్ల చొప్పున సరఫరా చేసేందుకు ప్రణాళిక వేసుకున్నామని అధికారులు తెలిపారు.తర్వాత దశల్లో జరిగే సర్వే ప్రక్రియ కోసం రాళ్ల కొరత రాకుండా ముందస్తుగానే సన్నాహాలు చేసుకోవాలని సీఎం సూచించారు. మున్సిపల్ ప్రాంతాల్లో చేయాల్సిన సర్వేకోసం సన్నాహాలు చేసుకుంటున్నామని మున్సిపల్ శాఖ అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి డేటా క్రోడీకరణ జరుగుతుందన్నారు. నిర్దేశించుకున్న టైం లైన్స్ ప్రకారం కచ్చితంగా సర్వే ప్రాంతాల్లో పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. ఏప్రిల్ మూడో వారం నాటికి 300 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తవుతుందన్న పంచాయతీరాజ్ అధికారులు.. డిసెంబరులోగా మొత్తం అన్ని గ్రామాల్లో ఈ సర్వే పూర్తి చేసేదిశగా లక్ష్యాలను పెట్టుకున్నామని సీఎంకు వివరించారు.

### కోవిడ్ కేసుల పెరుగుదలపై
## ఆందోళన వద్దు
### ఢిల్లీ సీఎం కేజ్రీవాల్



న్యూఢిల్లీ, మార్చి 31: దేశంలో మరోసారి కరోనా కేసులు పెరుగుతుండటం కలవరానికి గురిచేస్తోంది. గత 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా మొత్తం 3,095 కొత్త కేసులు నమోదయ్యాయి. మరోవైపు దేశ రాజధాని ఢిల్లీలో రోజువారీ కేసుల సంఖ్య ఇటీవల 300 దాటింది. గత ఏడాది ఆగస్టు తర్వాత ఈ స్థాయిలో కేసులు నమోదు కావడం ఇదే మొదటిసారి. దీంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. అయితే, కేసుల పెరుగుదల విషయంలో స్థానికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు

..మిగతా 2లో

### కరోనా తర్వాత పెరిగిన
## గుండెపోటు మరణాలు
### ఐసీఎంఆర్ అధ్యయనంలో షాకింగ్ విషయాలు



న్యూఢిల్లీ, మార్చి 31: కొన్ని నెలలుగా గుండెపోటుకు సంబంధించిన షాకింగ్ ఘటనలు భారీగా వెలుగు చూస్తున్నాయి. పెళ్లి సమయంలో కళ్యాణ మండపంలో గుండెపోటుతో కొందరు, క్రికెట్ ఆడుతూ కొందరు చనిపోతున్నారు. కరోనా మహమ్మారి తర్వాత, ఇలాంటి సంఘటనల సంఖ్య పెద్ద ఎత్తున పెరిగినట్లు అనిపిస్తోంది. ఈ ఘటనలు చూస్తుంటే గుండెపోటు మరణాలకు కరోనాతో సంబంధం ఉందా అనే ప్రశ్న తలెత్తుతుంది. దీన్ని తెలుసుకునేందుకు ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) అధ్యయనం చేస్తోంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవ్య వెల్లడించారు.గుండెపోటు, కోవిడ్ కారణంగా సంభవించే మరణాల మధ్య సంబంధాన్ని అంచనా వేయడానికి ఐఇఋ అధ్యయనం చేస్తోందని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవియా తెలిపారు. దీని ఫలితాలు 2 నెలల్లో రానున్నాయి. మన్సుఖ్ మాండవియా మాట్లాడుతూ కరోనా తర్వాత గుండెపోటు మరణాల రేటు పెరిగిందని అంగీకరించాడు. దీనిపై ఐసీఎంఆర్ అధ్యయనం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. తమ వద్ద ఉన్న టీకా గణాంకాలు ఆధారంగా ఐఇఋ గత 3-4 నెలలుగా అధ్యయనం

..మిగతా 2లో

## బెంగళూరు యువతిపై ఘోరం

కారులోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారం!



బెంగళూరు, మార్చి 31: కర్ణాటక రాజధాని బెంగళూరులో దారుణం చోటుచేసుకుంది. 19 ఏళ్ల యువతిని కారులోకి బలవంతంగా లాక్కెళ్లిన నలుగురు దుండగులు.. ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. నగరంలోని ఓ పార్కులో తన స్నేహితుడితో కలిసి కూర్చుని ఉండగా అక్కడికి వచ్చిన దుండగులు యువతిని ఎత్తుకెళ్లి ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ ఘటనపై పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న

..మిగతా 2లో

# అధికారుల వైఖరి దురదృష్టకరం

కోర్టు ఆదేశాలు పట్టించుకోవడం లేదు

వారిని జైలుకు పంపాలి

హైకోర్టు సంచలన వ్యాఖ్యలు




అమరావతి, మార్చి 31 (మనం న్యూస్): ప్రభుత్వ అధికారులు కోర్టు ఆదేశాలను పట్టించుకోవడం లేదని హైకోర్టు మండిపడింది. కోర్టుకు హాజరు కావాలని ఆదేశిస్తేనే అధికారులు స్పందించి పనులు చేస్తున్నారని విచారణ సందర్భంగా హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రెండు వేర్వేరు కోర్టు ధిక్కరణ కేసుల్లో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు హైకోర్టుకు హాజరయ్యారు. దంత వైద్య కళాశాలలో ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తున్న అరుణ అనే మహిళ.. తనకు 2018 నుంచి జీతం ఇవ్వట్లేదని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జీతం ఇవ్వాలని ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు అమలు చేయడం లేదని కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనికి సంబంధించి ప్రస్తుతం సీఎంవో

..మిగతా 2లో

# అంతిమ విజయం అమరావతిదే

- అమరావతి ఐకాస ధీమా
- 1200 రోజులకు ఉద్యమం..
- మందడంలో ప్రత్యేక కార్యక్రమాలు
- పాల్గొన్న వివిధ పార్టీల నేతలు
- రైతుల ఉద్యమంలో న్యాయముంది
- ధర్మం వారి వైపే
- టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు



అమరావతి, మార్చి 31 (మనం న్యూస్): వైసీపీ ప్రభుత్వంతో చేస్తున్న యుద్ధంలో అంతిమ విజయం అమరావతిదేనని అమరావతి పరిరక్షణ సమితి నేతలు చెప్పారు. రాజధానిగా అమరావతినే కొనసాగించాలంటూ ఆ ప్రాంత

..మిగతా 2లో

## హౌరాలో రామనవమి రోజు హింస

బెంగాల్ గవర్నర్‌ని నివేదిక కోరిన అమిత్ షా



కోల్‌కతా, మార్చి 31: శ్రీరామ నవమి రోజు పశ్చిమ బెంగాల్ హౌరాలో తీవ్ర హింస చెలరేగింది. హౌరాలోని కాజీపారా, శిబ్ పూర్ ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇరు వర్గాల మధ్య ఘర్షణలు చెలరేగడంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే నవమి తర్వాత రోజు కూడా హౌరాలో హింసాత్మక ఘటనలు జరిగాయి

..మిగతా 2లో

## గెలిచేది.. నిలిచేది అమరావతే: చంద్రబాబు



అమరావతి, మార్చి 31 (మనం న్యూస్): రాజధాని ప్రాంత రైతుల ఉద్యమంలో న్యాయముందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ధర్మం వారివైపే ఉందని.. అమరావతే గెలుస్తుందని చెప్పారు. రాజధాని రైతుల ఉద్యమం 1200 రోజులకు చేరిన సందర్భంగా ఆయన ట్వీట్ చేశారు. రైతుల పోరాట స్ఫూర్తిని చంద్రబాబు అభినందించారు. అమరావతి ఉద్యమం వైసీపీ ప్రభుత్వ ఆంక్షలు, వేధింపులు, సంకెళ్లను ఎదిరించి ముందుకు సాగుతోందన్నారు. అంతిమంగా గెలిచేది.. నిలిచేది అమరావతేనని ఆయన పేర్కొన్నారు.

**కియాపై జగన్ ఇప్పుడేం చెబుతారు?**

కియా పరిశ్రమపై గతంలో సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలను మరో ట్వీట్‌లో చంద్రబాబు ప్రస్తావించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కియాను తరిమేస్తానంటూ ప్రతిపక్ష నేతగా జగన్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ ఇప్పుడేం సమాధానం చెబుతారని నిలదీశారు. కియాపై నాడు జగన్ చేసిన వ్యాఖ్యలు.. తాజాగా లోకేశ్ సెల్ఫీ ఛాలెంజ్‌లను ప్రస్తావిస్తూ వీడియోలను చంద్రబాబు ట్విటర్‌లో పోస్ట్ చేశారు. కెన్యూ ఆన్సర్ మిస్టర్ జగన్? అని ఆయన ప్రశ్నించారు.

## అమరావతికి మద్దతిస్తే దాడులు చేస్తారా?



అమరావతి, మార్చి 31 (మనం న్యూస్): రాజధాని రైతులకు మద్దతుగా నిలిస్తే దాడులు చేస్తారా? అని మండిపడ్డారు జనసేన అధినేత పవన్ కళ్యాణ్. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్య కుమార్‌పై దాడి గర్హనీయం. ఆంధ్రప్రదేశ్ రాజధాని కోసం భూములిచ్చిన రైతులు 1200 రోజులుగా చేస్తున్న దీక్షలకు మద్దతు పలికిన వై.సత్య కుమార్‌పై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడటం గర్హనీయం. అధికారంలో ఉన్న వైసీపీ దాదాగిరీ పరాకాష్టకు చేరిందనే వాస్తవం ఈ దాడితో మరోమారు తేటతెల్లమయింది. ఈ దాడిని ప్రతి ప్రజాస్వామ్యవాది ఖండించాలి. రాజధాని రైతులకు మద్దతుగా నిలిస్తే దాడులు చేస్తామని రాష్ట్ర పాలకులు సందేశం ఇస్తున్నారా?ఇదే వైసీపీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి విధానం అయితే మేము కచ్చితంగా ప్రజాస్వామ్య పద్ధతిలోనే సమాధానం ఇస్తాం. ఆదినారాయణ రెడ్డి తప్పించుకున్నారు' అని వైసీపీ ఎంపీ ప్రకటించారు

..మిగతా 2లో

## టీడీపీ ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారం



అమరావతి, మార్చి 31 (మనం న్యూస్): ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్, ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ ఎమ్మెల్సీలు ఇవాళ మండలిలో ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ ఎమ్మెల్సీల చేత ప్రమాణ స్వీకారం చేయించారు శాసన మండలి ఛైర్మన్ మోషేన్ రాజు. రాంగోపాల్ రెడ్డి, టీడీపీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైనాట్ 175 అని సీఎం చేస్తున్న వ్యాఖ్యలు అసంబద్ధంగా ఉన్నాయి. పులివెందుల

..మిగతా 2లో

# బీజేపీ నేత సత్యకుమార్ కాన్వాయ్‌పై రాళ్లదాడి

రాళ్ల దాడిలో కారు అద్దాలు ధ్వంసం

సత్యకుమార్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

పథకం ప్రకారమే దాడి జరిగిందన్న సత్యకుమార్




అమరావతి, మార్చి 31 (మనం న్యూస్): బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ కాన్వాయ్‌పై ఏపీ రాజధాని అమరావతి ప్రాంతంలో దాడి జరిగింది. సత్యకుమార్ అనుచరుడిపై పిడిగుద్దులు గుద్దారు. మందడం గ్రామంలో మూడు రాజధానులకు మద్దతుగా కొంత మంది శిబిరం నిర్వహిస్తున్నారు. అమరావతి రైతుల ఉద్యమం ప్రారంభమై 1200 రోజులవుతున్న సందర్భంగా.. వారికి సంఘీభావం తెలిపేందుకు సత్యకుమార్, ఆదినారాయణరెడ్డి వచ్చారు. ఆ తర్వాత తుళ్లూరులో పార్టీ నేత ఒకరిని పరామర్శించడానికి వెళ్లారు. ఆయన తుళ్లూరు నుంచి మందడంలోని మూడు రాజధానుల మద్దతు శిబిరం మీదుగా వెళ్తారన్న సమాచారం ముందుగానే తెలియడంతో కొంత మంది ముందుగానే ఆయనను అడ్డుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సత్యకుమార్ కాన్వాయ్ మందడం దగ్గరకు రాగానే కొంత మంది అడ్డుకున్నారు. మరికొంత మంది రాళ్లతో దాడి చేశారు. దీంతో సత్యకుమార్ కాన్వాయ్ కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన సత్యకుమార్ డ్రైవర్ కారును ముందుకు తీసుకెళ్లిపోయారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలపైనా దాడి చేశారు. బీజేపీ జాతీయ కార్యదర్శిగా ఉన్న సత్యకుమార్ వాహనాన్నే ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకోవడం వెనుక వ్యూహం ఉందని బీజేపీ నేతలు అనుమానిస్తున్నారు. ఇటీవలి కాలంలో బీజేపీ అమరావతికి పూర్తి స్థాయిలో ప్రకటిస్తోంది. రాష్ట్రనేతలతో పాటు జాతీయ కార్యదర్శి హోదాలో ఉన్న సత్యకుమార్ కూడా

..మిగతా 2లో

## మంత్రి పదవి ఉన్నా.. లేకపోయినా బాధపడను

మంత్రి సీదిరి అప్పలరాజు

2



### మంచిమాట

మనసు చెప్పినట్టు
మనం వినడం కాదు..
మనం చెప్పినట్టు
మనసు వినేలా
చేసుకోవాలి.

శుభోదయం

మనం



# చిన్న మొత్తాల పొదుపు పథకాల వడ్డీ రేట్లు పెంపు

న్యూఢిల్లీ, మార్చి 31: చిన్న మొత్తాల పథకాల్లో పొదుపు చేసుకునే వారికి ఊరటనిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి త్రైమాసికానికి చిన్నమొత్తాల పొదుపు పథకాల వడ్డీ రేట్లను సవరించింది.దీంతో సీనియర్ సిటిజన్ల పొదుపు పథకాలు, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాల వడ్డీ రేట్లు మారనున్నాయి. మరోవైపు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సాధారణ సేవింగ్స్ డిపాజిట్ వడ్డీ రేట్లలో ఎలాంటి సవరణలు ప్రకటించలేదు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ శుక్రవారం విడుదల చేసిన నోటిఫికేషన్లో పేర్కొంది. చిన్న మొత్తాల పొదుపు పథకాల వడ్డీ రేట్లను 70 బేసిక్ పాయింట్ల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి కొత్త వడ్డీ రేట్లు అమల్లోకి వస్తాయని తెలిపింది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్, కిసాన్ వికాస్ పత్ర, సుకన్య సమృద్ధి యోజన వంటి చిన్న మొత్తాల పొదుపు పథకాలపై ప్రతి మూడు నెలలకోసారి కేంద్రం వడ్డీ నిర్ణయిస్తుంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ ప్రస్తుతం ఏడు శాతం వడ్డీ ఇస్తుండగా.. ఏప్రిల్ 1 నుంచి 7.7 శాతం వడ్డీ ఇవ్వనున్నారు. సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ వడ్డీ రేటును 8 శాతం నుంచి 8.2 శాతానికి పెంచారు.అలాగే మంత్లీ ఇన్కమ్ స్కీ్మ వడ్డీని 7.1 శాతం నుంచి 7.4 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. కిసాన్ వికాస్ పత్ర వడ్డీ రేటును 7.2 శాతం నుంచి 7.5 శాతానికి పెంచారు. మెచ్యూరిటీ అయ్యే నెలలను 120 నుంచి 115కి తగ్గించారు. ఏడాది కాలపరిమితితో డిపాజిట్ వడ్డీ రేటును 6.6 శాతం నుంచి 6.8 శాతానికి, రెండేళ్ల డిపాజిట్ వడ్డీ రేటును 6.8 శాతం నుంచి 6.9 శాతానికి, మూడేళ్ల డిపాజిట్కు 6.9 శాతం నుంచి 7 శాతానికి పెంచారు. ఐదేళ్ల కాలపరిమితి డిపాజి వడ్డీరేటును 7 శాతం నుంచి 7.5 శాతం పెంచుతున్నట్లు ప్రకటించింది. ఐదేళ్ల రికరింగ్ డిపాజిట్పై 5.8 శాతం నుంచి 6.2 శాతానికి పెంచారు. సుకన్య సమృద్ధి యోజన పథకానికి ప్రస్తుతం 7.6శాతం వడ్డీ ఇస్తుండగా, ఏప్రిల్ 1వ తేదీ నుంచి 8.0 శాతం ఇవ్వనున్నారు.

# భారత్‌కు కొత్త విదేశీ వాణిజ్య విధానం

న్యూఢిల్లీ, మార్చి 31: భారత ఎగుమతుల్ని 2030 నాటికి రెండు ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్త 'విదేశీ వాణిజ్య విధానాన్ని' ప్రవేశపెట్టింది. దీన్ని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం ఆవిష్కరించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ నూతన విధానం అమల్లోకి రానుంది.ఎప్పటిలా ఐదేళ్ల కాలపరిమితితో కాకుండా ఈసారి ఎఫ్‌టీపీ కి ఎలాంటి గడువును నిర్దేశించలేదు. కావాల్సినప్పుడల్లా మార్పులు చేర్పులు ఉంటాయని 'డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్' సంతోష్ సారంగి ప్రకటించారు. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం ఎగుమతుల విలువ 760- 770 బిలియన్ డాలర్లుగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. క్రితం ఏడాది ఇది 676 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు గుర్తుచేశారు. ఇప్పటి వరకు అమల్లో ఉన్న విదేశీ వాణిజ్య విధానాన్ని 2015 ఏప్రిల్ 1న ప్రవేశపెట్టారు. ఐదేళ్ల గడువుతో దీన్ని అమల్లోకి తీసుకొచ్చారు. కానీ, మధ్యలో కొవిడ్ కారణంగా పలు దఫాల్లో పొడిగిస్తూ వచ్చారు. చివరిసారి 2022 సెప్టెంబరులో సవరించి 2023 మార్చి 31 వరకు పొడిగించారు. కొత్త ఎఫ్టీపీలో కొత్త పట్టణాలను 'టౌన్స్ ఆఫ్ ఎక్స్‌పోర్ట్ ఎక్సలెన్స్' కింద ఎంపిక చేశారు. ఫరీదాబాద్, మొరాదాబాద్, మీర్జాపూర్, వారణాసి ఇందులో ఉన్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 39 పట్టణాలు టీఈఈల జాబితాలో ఉన్నాయి.

# కొవిడ్ కేసుల పెరుగుదలపై ఆందోళన వద్దు

(మొదటిపేజీ తరువాయి)

కరోనా పరిస్థి తులపై శుక్రవారం ఉన్నతాధికారులతో సమీ క్షా సమావేశం అనంతరం కేజ్రీవాల్ మీడి యాతో మాట్లాడారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. 'స్థానికంగా కొత్త కేసుల పెరుగుదలకు కొవిడ్ 'ఎక్స్‌బీబీ 1.16 వేరియంట్' ప్రధాన కారణం. మొత్తం పాజిటివ్ కేసుల్లో 48 శాతం ఈ వేరియంట్‌కు చెందినవే ఉన్నాయి. ఈ రకం వేగంగా వ్యాపిస్తుంది. కానీ, తీవ్రమైనది కాదు. కొవిడ్ బాధితుల కోసం దిల్లీ ఆసుపత్రుల్లో 7,986 పడకలు సిద్ధం చేశాం. ఐసొలేషన్ వార్డులను నిర్వహించాలని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను ఆదేశించాం. తగినన్ని ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నాం. వైరస్ వ్యాప్తిని అంచనా వేసేందుకు.. మురుగు పరీక్షలు చేపడుతున్నాం. కొత్త వేరియంట్లను సకాలంలో గుర్తించేందుకు వీలుగా.. అన్ని కేసులను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పంపుతున్నాం' అని కేజ్రీవాల్ తెలిపారు. ఇదిలా ఉండగా.. మార్చి 30న దిల్లీలో మొత్తం 295 కొత్త కేసులు నమోదయ్యాయి. ముగ్గురు మృతి చెందారు.

# బెంగళూరు యువతిపై ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

యువతి కోరమంగళ నేషనల్ గేమ్స్ విలేజ్ పార్కు వద్ద రాత్రి 9.30గంటల సమయంలో కూర్చొని ఉంది. అక్కడికి వచ్చిన నలుగురు యువకులు ఆమెను బలవంతంగా కారులోకి ఎక్కించి.. కదులుతున్న కారులోనే అఘాయిత్యానికి పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు. అయితే, ఆ సమయంలో ఆమె పక్కన తన స్నేహితుడు ఉండగా.. అతడిని బెదిరించి యువతిని బలవంతంగా కారులోకి లాక్కెళ్లినట్టు సమాచారం. అనంతరం దోమ్‌లూర్, ఇందిరానగర్, అనేకల్, నైస్రోడ్మీదుగా కారును నడుపుతూ తనపై కిరాతకానికి పాల్పడ్డారని బాధితురాలు వాపోయింది. మరుసటి రోజు తెల్లవారుజామున 4గంటల సమయంలో తన ఇంటికి సమీపంలోని రోడ్డుపక్కన వదిలి వెళ్లిపోయారని తెలిపింది. ఈ విషయం గురించి పోలీసులకు చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారని బాధిత యువతి ఫిర్యాదులో పేర్కొన్నట్టు పోలీసులు తెలిపారు. ఇంటికి చేరుకున్నాక ఆమెను చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. నలుగురు నిందితులను నగరంలోని ఇజీపురాకు చెందిన సతీశ్, విజయ్, శ్రీధర్, కిరణ్లను గుర్తించి అరెస్టు చేశారు. వీరి వయసు 22 నుంచి 26 ఏళ్ల లోపే ఉంటుందని పోలీసులు వెల్లడించారు. ఈ నలుగురు నిందితులు ప్రైవేటు సంస్థల్లో చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తుంటారని పోలీసులు పేర్కొన్నారు.

# హౌరాలో రామనవమి రోజు హింస

(మొదటిపేజీ తరువాయి)

కొంతమంది గుంపు ఇళ్లపై రాళ్ల దాడులు చేశారు. ఇదిలా ఉంటే బెంగాల్ లో పరిస్థితి ఆరాతీయడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్, రాష్ట్ర బీజేపీ చీఫ్ సుకాంత మజుందార్లకు ఫోన్ చేశారు. గవర్నర్ నుంచి అమిత్ షా నివేదిక కోరినట్లు తెలుస్తోంది. కాజీపారా, శిబ్ పూర్ ప్రాంతాల్లో పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. ఘర్షణల్లో పాల్గొన్నవారిలో ఇప్పటి వరకు 36 మందిని అరెస్ట్ చేశారు. ఈ ఘర్షణలపై అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల మధ్య విమర్శలు చెలరేగాయి. బీజేపీ కొందరు గుండాలను పంపించి ఘర్షణలకు పాల్పడుతుందని సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఒక వర్గాన్ని లక్ష్యం చేసుకుని దాడులు చేస్తున్నారంటూ విమర్శించారు. హిందువులు శ్రీరామ నవమిని జరుపుకోండి కానీ రంజాన్ మాసం అయినందు వల్ల ముస్లిం ఏరియాలకు వెళ్లవద్దని ఆమె సూచించారు. ఇదిలా ఉంటే బెంగాల్ లో మమతా బెనర్జీ హిందువులను పట్టించుకోవడం లేదని బీజేపీ ఆరోపించింది. బీజేపీ ఎంపి లాకెట్ ఛటర్జీ బెంగాల్లో హిందువులు ముప్పులో ఉన్నారు అని ఆరోపించారు మరియు రాష్ట్ర హోం మంత్రిగా ఉన్ బెనర్జీ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. తృణమూల్ నేత అభిషేక్ బెనర్జీ రామ నవమిలో తుపాకులతో పాల్గొన్న వారి వీడియోను షేర్ చేశారు. బీజేపీ ఈ అల్లర్లపై ఎన్ఐఏ విచారణ జరపాలని కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

# అంతిమ విజయం అమరావతిదే

(మొదటిపేజీ తరువాయి)

రైతులు, మహిళలు చేస్తున్న ఉద్యమం నేటికి 1200 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా ఐకాస ఆధ్వర్యంలో రాజధాని పరిధిలోని మందడంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. 'దగా పడ్డ రైతులు, దోపిడీకి గురవుతున్న ఆంధ్రా పౌరులు' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన, వామపక్షాల నేతలు పాల్గొన్నారు. ప్రత్యేక అతిథిగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు. ఉద్యమానికి తరలిరాకపోతే చరిత్ర క్షమించదని.. వైసీపీ ప్రభుత్వాన్ని పారదోలడమే తమ లక్ష్యమని ఐకాస నేతలు చెప్పారు. అనంతరం వివిధ పార్టీల నేతలు మాట్లాడారు.

**జగన్ ధ్యాసంతా ఆదాయంపైనే: కన్నా లక్ష్మీనారాయణ**

అధికార వైసీపీ తప్ప అన్ని రాజకీయ పక్షాలు అమరావతికి మద్దతి చ్చాయని టీడీపీ నేత, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మాట తప్పను.. మడమ తిప్పను అని చెప్పిన జగన్.. ఆ తర్వాత మాట మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ''అత్యంత ధనికుడిగా మారాలనేదే జగన్ లక్ష్యం. ఇసుక దొరక్కపోవడంతో భవన నిర్మాణ కార్మికులు రోడ్డునపడే పరిస్థితి వచ్చింది. సీఎంకు ప్రజల గోడు పట్టదు.. ఆయన ధ్యాసంతా ఆదాయంపైనే. వైసీపీ నేతల భూకబ్జాలకు ప్రజలు భయపడే పరిస్థితి వచ్చింది. జగన్‌కు దోపిడీ తప్ప.. ఇంకో పనిలేదు. సంక్షేమ కార్యక్రమాలన్నీ బూటకం. పేదలపై దోపిడీ తప్ప వారిపై జగన్‌కు అభిమానం లేదు'' అని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు.

**ఏడో నెలలో జగన్ ఏడవడం ఖాయం: సీపీఐ రామకృష్ణ**

అణచివేసేందుకు జగన్ ఎన్నో కుట్రలు చేశారని.. అయినా అమరావతి ఉద్యమం ఆగలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఉద్యమం ఇది అని చెప్పారు. రాజధాని అంశంలో సుప్రీంకోర్టుకు వెళ్లినా జగన్‌కు ఊరట లభించడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఏడో నెల(జులై)లో జగన్ ఏడవడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు. పోలీసుల అండ లేకుండా అమరావతిలో సీఎం తిరగలేకపోతున్నారని చెప్పారు. కేంద్రహోంమంత్రి అమిత్‌షా అనుగ్రహం లేకుంటే జగన్ జైల్లోనే ఉంటారని.. ఆయన ఒక్కమాట చెబితే జగన్ అమరావతిని కాదంటారా? అని రామకృష్ణ ప్రశ్నించారు.

వచ్చే ఎన్నికల్లో వ్యతిరేకశక్తులు కొట్టుకుపోతాయ్: కోటంరెడ్డి

అమరావతి నుంచి ఒక్క మట్టిపెళ్ల కూడా వైసీపీ ప్రభుత్వం కదిలించలేదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో అమరావతి వ్యతిరేక శక్తులు కొట్టుకుపోతాయని వ్యాఖ్యానించారు. ''అమరావతి 29 గ్రామాలది కాదు.. ప్రపంచంలోని కోట్లాది తెలుగువారిది. అమరావతి అప్పుడు ముద్దు.. ఇప్పుడెందుకు కాదో జగన్ చెప్పాలి. జగన్ అమరావతికి జైకొడితే ప్రజలు తప్పకుండా స్వాగతిస్తారు. ప్రధాని మోదీ చెబితే అమరావతి ఇక్కణ్నుంచి కదిలే అవకాశం లేదు. దేశంలోని నగరాలతో పోటీపడే శక్తి అమరావతికి ఉందని చంద్రబాబు నమ్మారు'' అని కోటంరెడ్డి అన్నారు.

బీజేపీ సంపూర్ణ మద్దతు: ఆదినారాయణరెడ్డి

అమరావతి ఉద్యమానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఉందని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి అన్నారు. వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉందని చెప్పారు. ''జగన్ విక్రమార్కుడు కాదు..విక్రయమార్కుడు. రాష్ట్రంలో ప్రతి ఒక్కటీ అమ్ముకుంటూ పోతారా? ఇలాంటి వ్యక్తి నాయకుడిగా కొనసాగితే ప్రజలు నష్టపోతారు'' అని అన్నారు. 1200 రోజుల ఉద్యమం అంటే చిన్న విషయం కాదని బీజేపీకి చెందిన మరో నేత సత్యకుమార్ అన్నారు. అమరావతి ఉద్యమం జగన్‌కు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య రైతులు భూమిలిస్తే వారిని భూస్వాములంటారా? అని మండిపడ్డారు. సీఎం ఆడే రాక్షస క్రీడలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని సత్యకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

మూడు రాజధానులకు వ్యతిరేకంగా ప్రజల తీర్పు: పంచుమర్తి

రాజధాని ప్రాంత రైతులు 1200 రోజులుగా పోరాడుతున్నా రాష్ట్ర ప్రభుత్వంలో స్పందన లేదని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో అమరావతికి అంగీకారం తెలిపిన జగన్.. ఆ తర్వాత మాట మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3 రాజధానులకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని చెప్పారు.

# బీజేపీ నేత సత్యకుమార్ కాన్వాయ్‌పై రాళ్లదాడి

(మొదటిపేజీ తరువాయి)

అమరావతికి మద్దతుగా రైతులకు సంఘీభావం చెప్పడానికి వచ్చారు. ఇలాంటి సమయంలో ఆయనపై దాడి చేయడం ద్వారా కొంతమంది వ్యక్తులు సంచలనం సృష్టించాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది.

పథకం ప్రకారమే దాడి: సత్యకుమార్ తనపై దాడికి సంబంధించి సత్యకుమార్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పక్కా పథకం ప్రకారం తనపై దాడి జరిగిందని వెల్లడించారు. తన కారుపై రాళ్ల దాడి జరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. కారుపై దాడి చేస్తుంటే చూస్తూ ఉన్నారేంటని తాము ప్రశ్నిస్తే, తమ వాళ్లనే పోలీసులు నెట్టివేశారని సత్యకుమార్ తెలిపారు. దాడిపై డీఎస్పీ సమాధానం చెప్పాలని నిలదీశారు. ఇలాంటి దాడులకు జగన్ రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. ఇవాళ రైతులను కలిసి సంఘీభావం తెలిపేందుకు పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి కూడా వచ్చారని సత్యకుమార్ వెల్లడించారు. అసలు, తన వాహనాన్ని పోలీసులే ఆపారని, ఎందుకు ఆపారని అడిగే లోపు వైసీపీ గూండాలు తన వాహనంపై దాడి చేశారని వివరించారు.

# వంద కోట్లు ఇస్తే.. కేటీఆర్‌ను ఇష్టమొచ్చినట్టు మాట్లాడొచ్చా ?

## టీఎస్‌పీఎస్సీని అవినీతి అడ్డాగా మార్చారు

## టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 31 (మనం న్యూస్): వంద కోట్లు ఇస్తే.. కేటీఆర్‌ను ఇష్టం వచ్చినట్టు మాట్లాడొచ్చా? అంటూ టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై ఈడీకి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఇతర నేతలు ఫిర్యాదు చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను అవినీతి పరులకు అడ్డగా మార్చింది బీఆర్ఎస్ సర్కార్ అంటూ విరుచుకుపడ్డారు. చైర్మన్, మెంబర్లపై ఏదో ఒక ఆరోపణలు ఉన్నాయని, అనర్హులను సభ్యులుగా నియమించారని మండిపడ్డారు. ఉద్యోగాలు రాక వంద లాది మంది చనిపోయినా కల్వకుంట్ల కుటుంబానికి చీమకుట్టినట్టైనా కావడం లేదని రేవంత్ ఆరోపణలు గుప్తించారు. ఒకవైపు పేపర్లు లీక్ అవుతుంటే ఇతర రాష్ట్రాల్లో పార్టీ విస్తరణపై కేసీఆర్ జూబ్లీహిల్స్‌లో పార్టీలు చేసుకోవడంపై కేటీఆర్ బిజీగా ఉన్నారని తీవ్రంగా మండిపడ్డారు. ఆధారాలు బయటపెట్టిన ప్రతిపక్షాలకు సిట్ ద్వారా నోటీసులు ఇచ్చి భయపెడుతున్నారు.

# కరోనా తర్వాత పెరిగిన గుండెపోటు మరణాలు

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగిస్తోంద న్నారు. ఆరు నెలల్లో నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఇప్పుడు ఈ అధ్యయన నివేదిక వచ్చే రెండు నెలల్లో వస్తుందని మాండవియా చెప్పారు. ఢిల్లీలోని ఎయిమ్స్ గుండెపోటు కారణంగా మరణించిన వారి డేటాను కూడా సమీక్షిస్తోంది. భారతదేశ అవసరాలను తీర్చడమే కాకుండా ఎగుమతి కోసం కూడా కరోనా వ్యాక్సిన్ ఉత్పత్తిని పెంచామని మాండవియా పేర్కొన్నారు.

భారతదేశం వినాశకరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని మొదట్లో చెప్పామని కేంద్ర మంత్రి అన్నారు. కానీ నేడు భారతదేశం అత్యుత్తమ వ్యాక్సిన్ ప్రచారం, కరోనా నిర్వహణ కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటుందన్నారు. బిల్ గేట్స్ కూడా భారత్‌పై ప్రశంసలు కురిపించారని చెప్పారు. ఇండియన్ హార్ట్ అసోసియేషన్ ప్రకారం, 50ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్నవారిలో 50%, 40 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారిలో 25% మంది గుండె జబ్బులకు గురయ్యే ప్రమాదం ఉంది. అంటే యువతలో గుండెపోటు రేటు పెరుగుతోందని, మహిళల కంటే పురుషులే ఎక్కువగా గుండె జబ్బులతో బాధపడుతున్నారని అర్థం. అధిక రక్తపోటు, షుగర్, ఒత్తిడి, ఊబకాయం, తగినంత నిద్ర లేకపోవడం, క్రమబద్ధమైన జీవనశైలి గుండె జబ్బులకు ప్రధాన కారణాలుగా పరిగణించబడతాయి. కోవిడ్ ఇన్ఫెక్షన్ తర్వాత శరీరంలో రక్తం గడ్డకట్టే రేటు వేగంగా పెరిగిందని, ఈ పెరిగిన గుండె జబ్బుతో కరోనాకు ఏదైనా సంబంధం ఉందా అని నిర్ధారించడానికి అధ్యయనాలు కూడా జరుగుతున్నాయని చాలా మంది నిపుణులు ఊహించారు.

# అధికారుల వైఖరి దురదృష్టకరం

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శిగా ఉన్న పూనం మాలకొండయ్య, హెల్త్ యూనివర్సిటీ వీసీ బాబ్జీ కోర్టుకు హాజరయ్యారు. ఒప్పంద ఉద్యోగి అరుణకు హెచ్‌ఆర్‌ఏ, డీఏతో కలిపి పూర్తి వేతనం చెల్లించకుండా.. కొంత మొత్తం ఎలా చెల్లిస్తారని ఉన్నత న్యాయస్థానం అధికారులను ప్రశ్నించింది. ఇన్నేళ్లు జీతం ఇవ్వకపోతే అమెకు జీవనోపాధి ఎలా అని నిలదీసింది. ఆమె ఉద్యోగం వదిలేసి వెళ్లి పోయేలా చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం చేసింది. అధికారులు ఈ విధంగా వ్యవహరించడం సరికాదని, కోర్టు ధిక్కరణకు పాల్పడే అధికారుల కోసం హైకోర్టులో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి జైలుకు పంపించాల్సి వస్తుందేమోనని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. మరో కోర్టు ధిక్కరణ కేసులో హోంశాఖ ముఖ్య కార్యదర్శి విశ్వజిత్, మాజీ డీజీపీ గౌతమ్ సవాంగ్ హాజరయ్యారు.

# అమరావతికి మద్దతిస్తే దాడులు చేస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

అంటూ సత్య కుమార్ చెప్పిన మాటలపై పోలీసులు దర్యాప్తు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలో వైసీపీ శ్రేణులు చేసిన ఈ దాడి ఘటనను బీజేపీ అధినాయకత్వం తీవ్రంగా పరిగణించాలి. కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలి. మూడు రాజధానులు అంటూ ప్రజలను మభ్యపెడుతున్న వైసీపీ ముఖ్యమంత్రినీ, ఆయన పార్టీనీ ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని పట్టభద్రులే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తిరస్కరించారు. క్షోభపడుతున్న రాజధాని రైతులకు అండగా నిలుస్తున్న రాజకీయ పక్షాలను, సంఘాలను వైసీపీ ముఖ్యమంత్రి, ఆయన అనుచరులు వర్గ శత్రువులుగా చూస్తున్నారు. రాష్ట్ర పాలకులు సామాన్య ప్రజలపైనా, ప్రశ్నించిన వారిపైనా ఏ విధంగా దౌర్జన్యాలు చేస్తున్నారు. ప్రతిపక్ష నాయకులను వేధిస్తూ, వారిపై దాడులకు పాల్పడుతున్నారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్తాం అన్నారు పవన్ కళ్యాణ్.

# టీడీపీ ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి నేను పోటీ చేసి ఎమ్మెల్సీగా గెలిచాను.వచ్చే ఎన్నికల్లో పులివెందులలో గెలిచి చంద్రబాబుకు అంకితం చేస్తాం అన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 108 నియోజకవర్గాల పరిధిలో గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో టీడీపీ గెలిచింది. వైసీపీ ఎమ్మెల్యేలలో అసంతృప్తి టీడీపీ విజయనికి తోడ్పడింది.టీడీపీ విజయం కోసం ఎంతో కృషి చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. చంద్రబాబుతోనే రాష్ట్రం బాగుపడుతుందని గ్రాడ్యుయేట్లు, విద్యావంతులు నాకు ఓటు వేశారు. ఎవరెన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా అమరావతే రాజధాని అని చెబుతున్నా. 2024లో టీడీపీ జైత్రయాత్ర ఈ ఎన్నికల నుంచే ప్రారంభమైంది. రాంగోపాల్ రెడ్డి పులివెందుల్లోనే మెజార్టీ తెచ్చారు. తిరుపతిలో ఎన్ని దొంగ ఓట్లేశారో అంతా చూశారు. టీడీపీ గెలుస్తుందని తిరుపతిలో సవాలు చేశాం. ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ టీడీపీ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు మాట్లాడుతూ నిరుద్యోగులకు సంబంధించిన సమస్యలు చాలా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఏపీపీఎస్సీకి, ఉన్నతాధికారులకు దీనిపై విజ్ఞాపన పత్రాలు ఇస్తాం. ఉద్యోగుల సమస్యలపైనా మేం పోరాటం చేస్తాం అన్నారు చిరంజీవి రావు.

# మంత్రి పదవి ఉన్నా.. లేకపోయినా బాధపడను

అమరావతి, మార్చి 31 (మనం న్యూస్): మంత్రి పదవి ఉన్నా లేకపోయినా బాధపడనని ఏపీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మంత్రి పదవి కన్నా తనకు ప్రజాసేవే ముఖ్యమని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం సీఎం జగన్‌తో మంత్రి అప్పలరాజు భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ''నా దృష్టిలో వైసీపీ ఎమ్మెల్యేలందరూ మంత్రులే. బీసీల నుంచి వచ్చిన నాకు జగన్ మంత్రి పదవి కట్టబెట్టారు. మంత్రి పదవి నుంచి తొలగిస్తారన్న సమాచారం లేదు'' అని అప్పలరాజు వివరించారు. ఏపీ కేబినెట్లో మార్పులు జరగబోతున్నాయంటూ కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. నలుగురు మంత్రులను తప్పించి.. కొత్తవారికి కేబినెట్లో అవకాశం ఇవ్వబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి అప్పలరాజు సీఎం జగన్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# జగదబి రాముడి మహా పట్టాభిషేకం



భద్రాచలం, మార్చి 31 (మనం న్యూస్) : భద్రాచలం కళ్యాణ రాముడు రాజాధిరాజుగా మారి శుక్రవారం పట్టాభిషేకుడై భక్తులకు కనువిందు చేశారు. తిరుకళ్యాణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం నాడు భద్రాద్రి రామయ్య మహా పట్టాభిషేకం కన్నుల పండుగ జరిగింది .మిథిలా ప్రాంగణంలో జరిగిన ఈ వేడుక అత్యంత భక్తిభావంతో ఆహ్లాదకరంగా సాగింది . రామాలయం నుంచి శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ఊరేగింపుగా మిథిలా స్టేడియం లోకి తీసుకు వచ్చారు అక్కడ స్వామివారిని వేంచేయింపజేసి అర్చకస్వాములు ప్రత్యేక పూజలు చేశారు .స్వామివారికి పాదుకలు,రాజదండం ,స్వర్ణ కిరీటం ,ధనుర్బాణాలు చేశారు మంగళ హారతులు ఇచ్చారు. వివిధ రకాల పారాయణలు పఠించారు. శ్రీరామ పట్టాభిషేకం వేడుక జరుగుతున్నంతసేపు భక్తులు రామనామ చేశారు. పట్టాభి రాముని తిలకించి అశేష భక్తజనులు పునీతులయ్యారు పట్టాభిషేకం ముగిసిన తర్వాత భక్తులపై పుణ్య నది జలాలు చల్లారు. ఈ మహా పట్టాభిషేకానికి రాష్ట్ర గవర్నర్ తమిళి సై హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు ముందుగా రోడ్డు మార్గాన భద్రాచలం చేరుకున్న గవర్నర్, ముందుగా రామాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడినుంచి మిథిలా ప్రాంగణంలోని స్వామివారి మహా పట్టాభిషేకం లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో మంత్రి సత్యవతి రాథోడ్ జిల్లా కలెక్టర్ అనుదీప్ ఎస్పీ వినీత్, ఆలయ ఈవో తదితరులు పాల్గొన్నారు.







## ఆరోగ్య శిబిరం ను ప్రారంభించిన సర్పంచ్ తనయుడు మంజునాథ్




బ్రహ్మసముద్రం. మార్చి 31.(మనం న్యూస్) బ్రంహసముద్రం మండల పరిధిలోని వేపులపర్తి గ్రామము నందు రంగనాథ స్వామి జాతర సందర్భంగా వచ్చి పోవు ప్రజలకు ఏలాంటి అనారోగ్య సమస్యలు ప్రభల కుండా సర్పంచ్ త నయుడు మంజునాథ్ బ్లీచింగ్ పౌడర్ చ ల్లించి ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్య క్రమంలో సర్పంచ్ తనయుడు మంజునాథ్. హెల్త్ సూపర్ వైజర్ రామలక్ష్మి.హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు .యం యల్ హెచ్ పి.లక్ష్మి .ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## కస్తూర్భాగాంధీ పాఠశాలలో నూతన ప్రవేశములకు దరఖాస్తు



డి. హీరెహాల్ మార్చి -31(మనం న్యూస్) : మండల కేంద్రం లోని స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినిలకు 6 వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం అభ్యసించు నూతన ప్రవేశములకు దరఖాస్తు కొరకు అవకాశం కల్పించింది.నూతన ధరఖాస్తును ఆన్లైన్ ద్వారా 27 మార్చి 2023 నుండి 20 ఏప్రిల్ 2023 వరకు అవకాశం కల్పించారు.దరఖాస్తు చేసుకొను వారు 6 వ విద్యార్థినిలకి 40 మందికి,ఇంటర్ నందు ఎంపి ఎచ్ డబ్ల్యూ కోర్స్ వారికి 40 మందికి మాత్రమే అవకాశం కల్పించినట్టు ఆ పాఠశాల ఎస్ ఓ కమలమ్మ తెలిపారు.

## మదనపల్లి నియోజకవర్గంలో నేడు ఎంపీ మిథున్ రెడ్డి పర్యటన



మదనపల్లి, మార్చి 31, మనం న్యూస్ ప్రతినిధి: రాజంపేట ఎంపీ, లోకసభ ప్యానల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో శని వారం పాల్గొంటున్నట్లు ఎమ్మెల్యే నవాజ్ భాష తెలిపారు.ఎంపీ, తన చేతుల మీదుగా మదనపల్లిలో వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. మదనపల్లి మునిసిపాలిటీ: ఉదయం 11:00 గంటలు మదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మదనపల్లి రూరల్ మండలానికి సంబంధించి పుంగనూరు బైపాస్ రోడ్డు, రామతులసి కళ్యాణ మంటపం ప్రక్కన మూడు గంటలకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ ఆసరా కార్యక్రమంలో అక్కచెల్లెమ్మలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## స్మశానం సమస్య పరిష్కరం



బంగారుపాళ్యం, మార్చి 31, మనం న్యూస్..చిత్తూరు జిల్లా బంగారు పాళ్యం మండలం రాజమానుపెంట పంచాయతీ పరిధిలోని మొగిల్లీశ్వర పాళ్యం గ్రామానికి చాలా సంవత్సరాలు స్మశానం లేక వంకల్లో చనిపోయిన వారికి దహన సంస్కారాలు చేసేవారు ఇది ప్రస్తుత సర్పంచ్ తోట శ్రీహరికి దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లడంతో అతను స్థానిక అధికారులకు,నాయకులకు జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి విన్నవించడంతో కలెక్టరు తెలపగా వెంటనే తహశీల్ధారుకు కలెక్టరు సమస్య పరిష్కరించమని ఆదేశించడంతో తహశీల్ధారు తన సిబ్బందితో వచ్చి స్మశాన భూమిని కొలిసి మార్కింగ్ వేయడం జరిగిందని ఇందుకు సహకరించిన అధికారులకు, నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,పాలేరు రామచంద్రారెడ్డి,శిరీష్ రెడ్డి,ఎంబి కుమార్ రాజా,నారే సోమశేఖర్,సహహకరించిన రైతులకు సర్పంచ్ శ్రీహరి,గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# జగనన్నకి అండగా వుంటూ రాష్ట్రాభివృద్ధికి తోడ్పడండి

### - ఎమ్మెల్యే భూమన




తిరుపతి, మార్చి 31, మనం న్యూస్: రాష్ట్రంలోని పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం పాటుపడుతూ ఇచ్చిన హామీల అమలుకు సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్న మన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికి మీరంతా అండగా వుంటూ రాష్ట్రాభివృద్ధికి తోడ్పాడాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి కోరారు. వై.ఎస్.ఆర్ ఆసరా మూడో విడత సంబరాల్లో భాగంగా శుక్రవారం తిరుపతి నెహ్రూ మునిసిపల్ హైస్కూల్ గ్రౌండ్ లో జరిగిన సభలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు బ్యాంకు ద్వారా పొందిన రుణాలు మాఫీ గురించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నెరవేర్చుటకు నాలుగు విడుతలగా పొదుపు సంఘాలలో 2019 ఏప్రిల్ నాటికి నిల్వ ఉన్న ఋణము



బకాయిలను పూర్తిస్థాయిలో ప్రభుత్వమే చెల్లిస్తున్నదని, ఇప్పటికే వైయస్సార్ ఆసరాను రెండు మార్లుగా 15,84,05 6 సంఘాలకు 1 కోటి 56 లక్షల 62 వేల 834 మందికి, 12758.28 కోట్లు ఇదివరకే జమ చేయడం జరిగిందని, ఇప్పుడు మూడో విడతగా 7,98,395 సంఘాలకు 78,94,169 మందికి 6,419.89 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. మహిళా సంక్షేమ పథకాలతో బాటు అన్ని వర్గాల పేద ప్రజల అభివృద్ధికి చేయుత నిచ్చేలా అనేక ప్రజాభివృద్ధి పథకాలను అమలు పరుస్తున్న జగన్ మోహన్ రెడ్డికి ప్రజలంతా తమ దీవెనలతో ఆశీర్వదించాలన్నారు. పొరబాటున చంద్రబాబును ప్రజలు నమ్మి అధికారమిస్తే జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలన్ని ఆపేస్తాడని భూమన పేర్కొన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఇప్పటికే రెండు విడుతలుగా పొందిన 126.32 కోట్లు మంజూరు అయ్యాయని, మొదటి రెండు విడతలుగా 63.16 కోట్లు జమ చేయగా, ఇప్పుడు మూడో విడతగా 31.58 కోట్లు మంజూరైనాయని కమిషనర్ అనుపమ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బసవ గీత,పొన్నాల చంద్రా,సి.కె.రేవతి,శ్రావణిమునిరామి రెడ్డి, తిరుత్తణి శైలజా,శేఖర్ రెడ్డి,నరేంద్రనాధ్, నారాయణ,ఆధం రాధాకృష్ణా రెడ్డి,కుడితి సుబ్రమణ్యం, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మెప్మా కృష్ణవేణి,వైసిపి నాయకులు మునిరామిరెడ్డి,నైనార్ మధుబాల,వెంకటేష్ రాయల్,నాగిరెడ్డి,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేవలచెరువులో శ్రీరామనవమి వేడుకలు..



గోరంట్ల మార్చి 31 మనం న్యూస్ః మండల పరిధిలోని ఒడిగేపల్లి పంచాయితీ దేవలచెరువులో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు స్వర్గీయ ఈశ్వర మాధవ మూర్తి తనయుడు చంద్రశేఖర్ మూర్తి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సహాయ సహకారాలతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. గతంలో ఈ ఆంజనేయ స్వామి ఆలయం చిన్నదిగా మరుగున పడిపోయి ఏదో సాదాసీదాగా పూజలు నిర్వహిస్తూ ఉండేది. తదనంతరం స్వర్గీయ ఈశ్వర మాధవ మూర్తి తనయుడు చంద్రశేఖర్ మూర్తి మరియు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల సహాయ సహకారాలతో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో పంచ లోహాలతో తయారు తయారు చేయబడిన సీత రామ లక్ష్మణ ఆంజనేయుని ఉత్సవ విగ్రహాలను దేవలచెరువు నివాసి అయిన భూగానపల్లి రాము సహాయంతోతయారు చేయించారు. ఆలయం ముంగిట ధ్వజస్తంభం ఇదే గ్రామానికి చెందిన ఆశ్వర్త నారాయణ మరియు కలశం రాజప్ప గారి నరసింహప్ప దాతల సహాయ సహకారాలతో తయారు చేయించారు. ఈ వేడుకలలో భాగంగా శ్రీరామనవమి పండుగ రోజున ఉదయం ఎనిమిది గంటల నుండి ఆలయ అర్చకులు శ్రీనాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించి,సాయంత్రం 7గంటల నుండి సీతా రామ లక్ష్మణ ఆంజనేయ ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవ కార్యక్రమం( మెరిమిని కార్యక్రమం ) నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంతో కనులవిందుగా సాగింది.ఈ సందర్భంగా ఆ ఏకపత్నీ వ్రతుడైన శ్రీరాముని ఆశీస్సులు గ్రామ ప్రజలందరికీ ఉండాలని, పాడిపంటలు సిరి సంపదలతో గ్రామం అభివృద్ధి కావాలని, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆలయ పూజారి సీతా రామ లక్ష్మణ ఆంజనేయలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ కోరుకున్నారు.

# వినాయక చేనేతనగర్‌లో మట్టి రోడ్లకు మోక్షం

### - రూ.4 లక్షలతో సీసీ రోడ్డు



కురబలకోట, మార్చి 31, మనం న్యూస్: మండలంలోని వినాయక చేనేతనగర్ 15 ఏళ్ల క్రితం ఏర్పాటైంది. అప్పటి నుండి మట్టి రోడ్లే దిక్కయ్యాయి. మదనపల్లె పట్టణాన్ని ఆనుకునే ఉన్నా గతంలోని నాయకులు పట్టించుకున్న పాపానపోలేదు. 60 చేనేత కార్మిక కుటుంబాలు ఉన్నాయి. పైగా ఈ ఊరు గుట్ట ప్రాంతంలో ఉంది. వర్షంపడితే నీళ్లన్నీ ఊరిపై పడతాయి. రోడ్లు కోసుకుపోయేవి. ఒక్క సిమెంట్ రోడ్డు లేదు. ఇటీవల ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించారు. స్థానిక సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఇందులో భాగంగా ఇదివరలో పార్కు మంజూరు చేశారు. హైవే రోడ్డు నుండి కాలనీలోకి వీధి దీపాల సౌకర్యం కల్పించారు. ఇప్పుడు తొలి సారిగా ఆ ఊరికి రూ. 4 లక్షల పంచాయతీ నిదులతో సిమెంట్ రోడ్డు వేయించారు. సౌకర్యాలు సమకూరు తుండడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాయకులు మదార్ సాబ్, మద్దూరి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## క్షతగాత్రులను పరామర్శించిన మనోహర్



కుప్పం, మార్చి 31, మనం న్యూస్: రామకుప్ప మండలంలో జరిగే ఆసరా కార్యక్రమానికి వెళుతూ బొలెరో వా హనం అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఉన్సీగాని పల్లి గ్రామానికి చెందిన సుమారు 37 మంది మహిళలలో కొందరుతీవ్రంగా గాయపడి కుప్పం పిఈఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా క్షతగాత్రులను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ తో పాటు టిడిపి నేతలు పరామర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోవడంతో పాటు మెరుగైన వైద్య చూడాలని వైద్యులతో సంప్రదించారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి ప్రభుత్వం ఉచితంగా మెరుగైన వైద్యం అందించడంతోపాటు ఎక్స్రేషియా ఇవ్వాలంటూ ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

## ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయండి

### - మునిసిపల్ కమిషనర్‌కు నాయి బ్రాహ్మణుల సంఘం వినతి



కుప్పం, మార్చి 31, మనం న్యూస్: కుప్పం మున్సిపాలిటీలో గల హెయిర్ షాప్ లో జీవనం సాగిస్తున్న నాయి బ్రాహ్మణులకు ప్రధాన సమస్య అయినటువంటి ట్రేడ్ లైసెన్స్ కు సంబంధించినటువంటి విషయం గుర్చి కమిషనర్ కి వినతి పత్రం అందించడం జరిగింది. చేతి వృత్తి పని చేస్తూ జీవనం సాగిస్తున్న నాయి బ్రాహ్మణులకు ట్రేడ్ లైసెన్స్ నుండి మినహాయింపు ఇస్తూ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జీవో ఉత్తర్వులను పరిశీలించి నాయి బ్రాహ్మణుల సంఘం తరపున ప్రకాష్ చేతుల మీదుగా నాయి బ్రాహ్మణులు సమస్యను కమిషనర్ కి తెలియజేయడం చేయడం జరిగింది. ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయాలని కోరడమైనది కమిషనర్ దీనికి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారిస్తానన్నారు ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం కులస్తులు మరియు నాయకులు పాల్గొన్నారు బి ప్రకాష్ జిల్లా ప్రెసిడెంట్ నాయి బ్రాహ్మణుల సంఘం అధ్యక్షులు. ఎం కృష్ణమూర్తి కుప్పం మండల్ ప్రెసిడెంట్ నాయి బ్రాహ్మణుల సంఘం అధ్యక్షులు . మునెప్ప, కృష్ణమూర్తి నరేష్డి గిరీష్ , సుబ్రహ్మణ్యం, శివకుమార్, మునిరత్నం,వెంకటేష్ పాల్గొన్నారు.

# ఏప్రిల్ మొదటి వారంలో అభ్యర్థుల లిస్టు ప్రకటిస్తాం

### - బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు వెల్లడి



బళ్లారి, మార్చి 31, మనం ప్రతినిధి భారతీయ జనతా పార్టీ హై కమాండ్ మరో వారం రోజుల్లో గా, అన్ని స్థానాల అభ్యర్థులను ప్రకటిస్తుందని, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నళి న్ కుమార్ కటిల్ వెల్లడించారు. శుక్రవారం విధానసభ ఎన్నికల పర్యటనలో భాగంగా బళ్లారి బిజెపి కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రతి నియోజకవర్గానికి అభ్యర్థిని ఎంపిక చేసేందుకు కమిటీని నియమించినట్టు, వారు పార్టీ కార్యకర్తలు స్థానిక నాయకులు కలిసి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. బహుశా ఏప్రిల్ 4,5 తేదీలలోగా, ప్రక్రియల ముగిస్తున్న నేపథ్యంలో దీటైన అభ్యర్థులను రంగంలోకి బిజెపి పోటీకి నిలబెడుతుందన్నారు. రాష్ట్రంలో బిజెపి వైపు భవనాలు వేస్తున్న కారణంగా, కాంగ్రెస్ ఘోర పరాభవం చవిచూస్తుందన్నారు. కూలికి ఎమ్మెల్యే రాజీనామా పై విలేకరులు ప్రశ్నించగా, ఒక పార్టీ నుంచి మరో పార్టీకి మారడం ఎన్నికల్లో సాధ్యమైందని, ఇతర పార్టీల నుంచి బిజెపిలోకి కూడా వచ్చే నాయకులు ఉన్నట్టు ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు మురారి గౌడ, సిరి గుప్ప,ఎమ్మెల్యే సోమలింగప్ప, డాక్టర్ మహిపాల్ లతోపాటు పలువురు నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామాగ్రీ వితరణ



రామకుప్పం, మార్చి 31, మనం న్యూస్ : రామకుప్పం మండలం ముద్దనపల్లి గ్రామానికి చెందిన మధుసూదన్ శుక్రవారం స్థానిక మోడల్ పాఠశాల 10 వతరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రీని వితరణ చేశారు మధుసూదన్ మాట్లాడతూ తన తండ్రి జ్ఞాపకార్థం 2022-2023 విద్యా సంవత్సరం ఫైనల్ పరీక్షల్లో పాల్గొను విద్యార్థిని విద్యార్థులకు తనవంతు పరీక్షా సామాగ్రీని వితరణ చేస్తున్నానన్నారు ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించి మీ పాఠశాలకు మీ తల్లి తండ్రులకు మంచి పేరు తెచ్చుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు రామచంద్రన్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యాకమిటీ మెంబర్ రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్సార్ ఆసరా పథకం ప్రారంభంలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి
- భారీగా తరలివచ్చిన మహిళలు



రాప్తాడు మనం న్యూస్ మార్చి 31: టిడిపి నేత లోకేష్ ఏ మొహం పెట్టుకుని పాదయాత్రకు వస్తున్నాడు. ఇంటింటికీ ఉద్యోగాలు ఇస్తామని యువతను మోసం చేసినందుకా, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మహిళలను మోసం చేసినందుకా, రైతు రుణాలు మాఫీ చేస్తామని రైతులను మోసం చేసినందుకా బంగారు రుణాలు మాఫీ చేస్తామని అక్కచెల్లెమ్మలను మోసం చేసినందుకా? అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్రెడ్డి మండిపడ్డారు. రాప్తాడు సమీపంలోని జాకీ స్థలంలో అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలకు సంబంధించి వైఎస్సార్ ఆసరా పథకాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, డీఆర్డీఏ పిడి నరసింహారెడ్డి పాల్గొన్నారు. అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల నుంచి మహిళలు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోసం చేయడమే వారి జెండా...అజెండా. మోసగాళ్ల ముఠా తెలుగుదేశం ముఠా. ఎన్నో కష్టాలు, నష్టాలకు ఓర్చి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాకూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అక్కచెల్లెమ్మల కళ్లలో ఆనందం చూడాలని, వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారు. తన కుటుంబం గురించి ఏమాత్రం ఆలోచన చేయకుండా రాష్ట్రంలోని అన్ని కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో వైఎస్ జగన్మోహన్రెడ్డి అడుగులు వేస్తున్నారు. అన్నగా, తమ్ముడిగా, బిడ్డగా మీ అందరూ ఆశీర్వదించి నన్ను గెలిపించారు. మిమ్మల్ని ఎప్పటికీ మరిచిపోను. చంద్రబాబు ఏరోజూ పేదల పక్షాన నిలబడలేదు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలని ఆలోచించలేదు. ఏ సంక్షేమ పథకమూ అమలు చేయలేదు. ఇళ్ల నిర్మాణాలు తూతూమంత్రంగా చేపట్టారు. అదే జగనన్న రాష్ట్రంలో 30 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలిచ్చారు. వారికి ఒక ఆస్తిని ఇచ్చారు. మీకు అన్నివిధాలా అండగా ఉంటున్న ముఖ్యమంత్రి గురించి ఈరోజు తూలనాడుతున్నారు. జగన్మోహన్రెడ్డికి పరిపాలన చేతకాదు అని ఒక పెద్ద మనిషి మాట్లాడుతున్నాడు. డబ్బు దుబారా చేస్తున్నాడని అంటున్నాడు. సంక్షేమ పథకాలు ఎందుకిస్తున్నాడు, ఎవరబ్బ సొమ్ము అని అంటున్నాడు. అయ్యా... చంద్రబాబూ ఇది ప్రజల సొమ్ము కాబట్టే వారికి పంచుతున్నాడు. పేదవాడికి అన్నం పెట్టడానికే ఏ ప్రభుత్వమైనా పని చేయాలి. చివరగా అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలకు సంబంధించిన 16,60,63,116 రూపాయల విలువైన వైఎస్సార్ ఆసరా పథకం మెగా చెక్కులను డ్వాక్రా సంఘాల లీడర్లకు ఎమ్మెల్యే, జెడ్పీ చైర్పర్సన్, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు,డైరెక్టర్లు, స్టోర్ డీలర్లు, మండల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు..

## వెలకట్టలేని అమూల్యమైన గ్రంథం భగవద్గీత

- బియ్యపు పవిత్ర రెడ్డి



శ్రీకాళహస్తి, మార్చి 31, మనం న్యూస్: వెలగట్టలేని అమూల్యమైన గ్రంథం భగవద్గీత అని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్ర రెడ్డి అన్నారు శుక్రవారం ఆమెకు శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు భగవద్గీత మహా గ్రంధాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవాన్ వాసుడు భక్తుడైన అర్జునుడుకు స్వయంగా భగవద్గీతను బోధించినారన్నారు అట్టి భవద్గీతను ప్రతి ఒక్కరు చదివి సనాతన ధర్మాలను పాటించాలన్నారు విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులు తమ పిల్లలకు విధిగా భగవద్గీతను అందులో శ్లోకాలును నేర్పించాలన్నారు ప్రతి ఒక్కరికి ఉచితంగా భగవద్గీతను అందిస్తున్న శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులైన మల్లెంబాకం మునికృష్ణారెడ్డిని అభినందించారు భగవద్గీత చదవాలన్న కోరిక ఉన్నవారికి భగవద్గీతను ఆచరించాలన్న వారికి తనను సంప్రదిస్తే ఉచితంగా భగవద్గీత మహా గ్రంథాన్ని వారికి అందిస్తానని తెలియజేశారు.

## దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న పొదుపు సంఘాలు.. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



గార్లదిన్నె మార్చి 31మనం న్యూస్: పేద ప్రజలను ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడు మన ముఖ్యమంత్రి జగనన్న అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. వైయస్సార్ ఆసరా మూడో విడత వారోత్సవాల్లో భాగంగా గార్లదిన్నె మండలం పరిధిలో నీ ఎగువపల్లి దగ్గర వై ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు కోట్లాది రూపాయలను జగనన్న ఇస్తున్నారని అన్నారు. ఇవన్నీ పచ్చ మీడియాకు,నేను సీనియర్ రాజకీయ నేతని అని తిరిగే చంద్రబాబుకు, ఇంకా నోరు తిరగని ప్రతిపక్ష నేతలకు కనిపించవని విమర్శించారు. నవరత్నాల్లో దాదాపు 85 శాతం అంతిమ లబ్ధిదారుల్లో మహిళలే ఉండేలా జగనన్న పథకాలను తీర్చిదిద్దారని అన్నారు. ప్రతి మహిళకు మంచి చేయాలనే ఉద్దేశంతో జగనన్న ముందుకెళ్తుంటే పచ్చ మీడియా ఓర్వలేక గుండెలు బాదుకుంటోందని విమర్శించారు. వైయస్సార్ అసరా, వైయస్సార్ చేయూత, వైయస్సార్ కాపు నేస్తం, వైయస్సార్ ఈబీసీ నేస్తం, ఇళ్ల పట్టాలు, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన ఇవన్నీ మహిళల పేరు మీదే జగనన్న ఇస్తున్నారన్న సంగతి అందరికీ తెలిసిందేనని అన్నారు. ఇవన్నీ చూసి పేద ప్రజలని, మహిళలని ఆదుకునేది ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని గుర్తించి, మళ్లీ జగనన్నకే ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కణంపల్లి నరేందర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వై నారాయణరెడ్డి,బలపనూరు అశోక్, సుధాకర్ రెడ్డి, ఎంపీపీ వెంకట్ నారాయణ, ఎంపీడీవో విజయభాస్కర్ అధికారులు నాయకులు ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శోభకృత్ నామ సంవత్సర త్రైత సిద్ధాంత తెలుగు యుగాది కాలమానికల ఆవిష్కరణ



ఐ గార్లదిన్నె మార్చి 31మనం న్యూస్ శుక్రవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం లో సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి , ఏపీఓ నాంచారమ్మ ఆవిష్కరించారు. అనంతరం తాసిల్దార్ , మండల ప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బందికి క్యాలండర్ లను వితరణ చేయడం జరిగింది . ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామివారు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచిక లో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికి సరళమైన భాషలో అర్థం అయ్యే విధానం గా రూపొందించడం జరిగింది అని అన్నారు..ఈ కాలసూచికలో ఇంకా చాలా విశేషాల్లో భాగంగా దేవాలయం సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండుగల విశిష్టత, మరియు తెలుగు నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకముల సారముతో పాటు ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉన్న భగవద్గీత యొక్క సారాంశం ఇందులో పొందుపరిచి స్వామివారు రచించడం జరిగింది అని త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కల్లూరు కమిటీ అధ్యక్షుడు శివరాం అన్నారు.తెలుగు నెలలు అనుసరించుటకు వీలుగా తెలుగు తిథుల తో ఆంగ్ల తేదీల ను పొందుపరచి తయారు చేసిన ఇటువంటి గొప్ప కాలసూచికను అందించడం ప్రజలందరూ హర్షించదగ్గ విశేషం అన్నారు. తెలుగు యుగాది క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కల్లూరు కమిటీ అధ్యక్షులు, సభ్యుడుశివరాంప్రసాద్ , చిరంజీవి,సుధాకర,మునిరత్నం, ఓబులేసు,శ్రీనివాసులు,నరేష్,రామకృష్ణ,చంద్రశేఖర్,పాల్గొన్నారు.

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి



అనంతపురము,మార్చి,31: మనం న్యూస్ ప్రతినిధిః జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించా లని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్ పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు.జిల్లాలో నూతన పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సింగల్ విండో పోర్టల్ లో జనవరి,ఫిబ్రవరి మాసములలో 110 దరఖాస్తులు రాగా అందులో 93 దరఖాస్తులు నిర్దేశించిన గడువులోగా ఆమోదించబడినదన్నారు. మిగిలిగిన 17 దరఖాస్తులను పెండింగులేకుండా గడువు తేదీ లోపల ఆమోదించాలని జిల్లా కాలుష్య నియంత్రణ, పరిశ్రమలు, భూగర్భ జల శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 2015-20 ఇండస్ట్రియల్ పాలసీలలో 6 యూనిట్లకు రూ. 6.40 లక్షలు, 2020-23 ఇండస్ట్రియల్ పాలసీలో 5 యూనిట్లకు రు.10.22 లక్షలు,వైస్సార్ జగనన్న బడుగు వికాసము క్రింద 42 యూనిట్లకు రు.651.63 లక్షల సబ్సిడీ మంజూరుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. వివిధ కారణాలవల్ల 4 యూనిట్లకు సంబంధించి 5 క్లైయిమ్ లను తిరస్కరించడం జరిగిందన్నారు. నూతన పారిశ్రామిక విధానము 2023-27 గురించి జిల్లా కలెక్టర్, సభ్యులందరికి పరిశ్రమల శాఖ అధికారి జి.నాగరాజ రావు వివరించారు. నూతన పారిశ్రామిక విధానము విధి విధానాలు ప్రభుత్వము నుండి విడుదల అయిన తరువాత అవగాహన సదస్సులను నిర్వహిండం జరుగుతుందన్నారు. పి ఎం ఈ జి పి 2022-23 ఆర్థిక సంవత్సరం నందు 770 దరఖాస్తులను వివిధ బ్యాంకులకు పంపించగా, నిర్దేశించిన 284 యూనిట్లు గాను 175 యూనిట్లకు రూ.664.00 లక్షల మార్జిన్ మనీతో గ్రౌండింగ్ అయ్యాయని,51 యూనిట్లకు రూ.185.00 లక్షల మార్జిన్ మనీ మంజూరు వివిధ దశలలో ఉన్నాయన్నారు. మార్చి 3,4 తేదీల్లో రాష్ట్రప్రభుత్వం విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ని నిర్వహించడం జరిగిందన్నారు.ఈ సదస్సులోఅనంతపురము జిల్లాలో 2 యూనిట్ ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వముతో ఎం ఓ యు చేసుకున్నాయన్నారు. వాటిలో పోస్పోల్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ.275 కోట్లు పెట్టుబడి విలువతో 2500 మందికి ఉపాధి లక్ష్యంగా, ఎకో స్టీల్ ఇండియా లిమిటెడ్ వారు రూ.554 కోట్ల పెట్టుబడి విలువతో 500మందికి ఉపాధి లక్ష్యంగా పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చారన్నారు. ఈ సందర్భముగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి పరిశ్రమలకు అవసరమైన అనుమతులను సత్వరముగా మంజూరు చేయాలనీ సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల వారికీ ఏవైనా ఇబ్బందులు ఉంటె డి.ఐ. ఈ. పి. సి. కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. సమీక్షలో ఎల్.డి.ఎం. నాగరాజా రెడ్డి,డీ.సీ.ఎఫ్.ఐ కేశవులు, ఎఫ్.ఎ పీ.సీ.సీ.ఐ. శేషాంజనేయులు , ఎఫ్ ఎ పి ఎస్ ఐ నాగరాజు, జెడ్ ఎం ఏ పి ఐ ఐ సి మురళీమోహన్, ఏ పి ఎస్ ఎఫ్ సి బ్రాంచ్ మేనేజర్ ప్రకాష్,రీజినల్ రవాణా శాఖ అధికారి సురేష్ నాయుడు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు డి ఐ సి సి ఐ, ఎస్ ఎస్ సి సి ఐ,టి ఐ సి సి ఐ, అండ్ డి.ఐ.ఓ.ఎకో స్టీల్ యాజమాన్య ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం నుండి పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం



అగలి, మార్చి31 మనం న్యూస్ : మండల కేంద్రంలో ఏప్రిల్ 3 నుండి జరగబోయే పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అగలి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష రాయడానికి కావలసిన సామాగ్రి ఒక్కొక్క విద్యార్థికి ఐదు పెన్నులు, ఒక స్కెచ్ బాక్స్, ఒక ఎగ్జామ్ ప్యాడ్, స్కేలు, పెన్సిల్స్, మరియు రబ్బర్లు అందజేశారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇంగ్లీష్ ఉపాధ్యాయులు అబ్దుల్ ఖాదర్, సైన్స్ ఉపాధ్యాయులు పవన్ కుమార్, మరియు ఆర్ట్ ఉపాధ్యాయుడు ఓబులేసు, విద్యార్థిని విద్యార్థులకు వితరణ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మఠం గురు సిద్ధమూర్తి తెలిపారు.అలాగే పిల్లలకు పరీక్షల పట్ల పూర్తి అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు.ఉపాధ్యాయులు అలివేలమ్మ, ఆరాధ్య, పిడి సంజీవరాయుడు, జిలాన్, షబ్బీర్, చంద్రకళ, నాగార్జున దాతలకు అభినందనలు తెలియజేస్తూ విద్యార్థులకు ఆశీస్సులు తెలియజేశారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



నార్పల మార్చి 31(మనం న్యూస్ ): ఐమండల కేంద్రంలోని స్థానిక దుగుమర్రి రోడ్డులో గుజరీ దుకాణం నిర్వహించే సుబహాన్(40) గురువారం రాత్రి గుజరీ దుకాణంలోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గత రెండు, మూడు సంవత్సరాల నుండి అప్పులు అధికం కావడంతో కొద్దీ కాలం నుండి తీవ్ర మానసిక వేదనకు గురి అయ్యేవాడు అని బంధువులు తెలిపారు. మృతునికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య హసీనా ఫిర్యాదు మేరకు సిఐ అస్రార్ భాష కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

## ప్రజా పాలన కాదు పోలీస్ రాజ్యం..? సాకే హరి

రాప్తాడు మనం న్యూస్ మార్చి 31 ప్రజల చేత ఎన్నుకొన్న ప్రభుత్వం పాలనలో గాడి తప్పి పోలీస్ రాజ్యంగా అణచివేస్తోందని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు.శుక్రవారం తెల్లవారు జామునే మైనార్టీ కాలనీలో ఇంటి నుండి సాకే హరిని ఎస్సీ,ఎస్టీలపై జరుగుతున్న దాడులు,హత్యలు ఆపాలని కలెక్టరేట్ ముట్టడిని అడ్డుకునేందుకు ముందస్తు అరెస్టు చేసి రాప్తాడు పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్ళారు.స్టేషన్ అవరణంలో సాకే హరి మాట్లాడారు.తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ,ఎస్టీలపై దారుణంగా దాడులు జరుగుతున్నాయని కొన్ని చోట్ల ఏకంగా హత్యలకు తెగబడుతున్నారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం,పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని వాపోయారు.తెలంగాణలో డాక్టర్ ప్రీతి నాయక్,ఆంధ్రలో రమాదేవి హత్యలకు కారకులను క్షమించరాదని నిందితులకు ఉరిశిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు.కులాలు విభజించనట్లుగా న్యాయాలు రెండు రకాలుగా ఉన్నత వర్గాలకు ఓ న్యాయం పేదలకు మరో న్యాయం సరికాదన్నారు.దారుణ హత్యలు జరిగిన తర్వాత పరామర్శ,పరిహారాలని మోసం చేస్తున్నారని ఏవి మాకొద్దు ప్రాణాలు కాపాడాలని కోరారు.కొత్త చట్టాలు సంగతేమో ఉన్న చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు.మా మీద జరిగే దాడులను ఎంతకాలం భరిస్తూ బతకాలి చట్ట ప్రకారం పోరాడాలని పిలుపునిచ్చారు.అరెస్టు అయిన వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వతంత్ర కుమారి.జే.ఏ.సీ నాయకులు రేకల కుంట రామాంజనేయులు. రామకృష్ణలన్నారు.



## బిజెపికి గుడ్ బై చెప్పిన కూడ్లి గి,ఎమ్మెల్యే గోపాల్ కృష్ణ

బళ్ళారి, మార్చి 31, మనం ప్రతినిధి సీనియర్ రాజకీయ నాయకుడు,కూ డ్లి గి ఎమ్మెల్యే ఎన్ వై గోపాలకృష్ణ, శుక్రవారం నాడు, తన శాసనసభ స్థానానికి రాజీనామా చేశారు. విధానసభ స్పీకర్, విశ్వేశ్వర కావేరికి రాజీనామా పత్రాన్ని అందించారు. బిజెపికి కూడా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. బిజెపిలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వారికి మంత్రి పదవులు కట్టబెట్టి, తాను ఆరు సార్లు ఎమ్మెల్యే అయినా మంత్రి పదవి ఇవ్వలేదని వాపోయారు. ఈ కారణంతో బిజెపికి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు, చిత్తూరు జిల్లాలోని మొ లకల్మురు, శాసనసభ నియోజకవర్గం నుండి పోటీ చేస్తానని, అది కూడా కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తేనే ఎన్నికల్లో పోటీ చేస్తానని తెలిపారు.

## యువనాయకుడు నారా లోకేష్ యువగళంలం పాదయాత్ర

- సభాస్థలిని,బస చేసే ప్రాంతాలను,రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న పార్లమెంట్ అధ్యక్షులు కాల్వ శ్రీనివాసులు

శింగనమల( మనం న్యూస్,): నియోజకవర్గ కేంద్రంలో యువనాయకుడు నారా లోకేష్ యువగళంలం పాదయాత్ర సభాస్థలిని, బస చేసే ప్రాంతాలను,రూట్ మ్యాప్ ను పరిశీలిస్తున్న పార్లమెంట్ అధ్యక్షులు కాల్వ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి శింగనమల నియోజకవర్గ ద్వీసభ్యకమీటి సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి,ఆలం నరసానాయుడు, తెలుగుదేశం పార్టీ పరిశీలకుడు రవి యాదవ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు సి.వెంకటేష్,దాసరి గంగాధర్ మాజీ ఎంపీటీసీ కూళ్ళాయప్ప పార్లమెంటు కోశాధికారి శ్రీనివాసులు గౌడ్, గార్లదిన్నె మండల కన్వీనర్ పాండు యం.ఆదినారాయణ,బిసి సెల్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, తెలుగు యువత అధికార ప్రతినిధి బ్యాళ్ళ సుదర్శన్, మైనార్టీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శి మహ్మద్ గౌస్,డి.నాగేంద్ర, జంగంశెట్టినవీన్ రాజాబాబు, రంగస్వామి, సోము,తదితరులు పాల్గొన్నారు

# విరాట్ సమాధానంతో ఆశ్చర్యపోయా..




నేను మాత్రం అలా ముగించా: సర్ఫరాజ్

న్యూఢిల్లీ: టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లితో జరిగిన ఓ సంఘటనను పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ తాజాగా గుర్తు చేసుకున్నాడు. 2019 వన్డే ప్రపంచకప్ భారత జట్టుకు విరాట్ కోహ్లి సారథ్యం వహించిన విషయం తెలిసిందే. పాక్కు సర్ఫరాజ్అహ్మద్ కెప్టెన్గా వ్యవహరించాడు. టోర్నీకి ముందు అన్ని జట్ల కెప్టెన్లు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్ -పాక్ మ్యాచ్ విలేకర్లు ప్రశ్నలు సంధించారు. అయితే విరాట్ కోహ్లి మాత్రం సుదీర్ఘంగా సమాధానం ఇవ్వగా.. సర్ఫరాజ్ మాత్రం కేవలం ఆరు పదాల్లోనే ముగించేశాడట.''భారత్ – పాక్ జట్ల మధ్య మ్యాచ్లకు హైప్ ఎందుకు ఉంటుంది..? అభిమానులు టికెట్ల గురించి అడిగితే మీరు ఎలా స్పందిస్తారు..? అని మమ్మల్ని అడిగారు. తొలుత విరాట్ను అడగండని నేను చెప్పా. బ్రదర్ తొలుత నువ్వు సమాధానం ఇవ్వొచ్చుగా అని విరాట్ను అడిగా. ఇక విరాట్ కోహ్లి సమాధానం ఇవ్వడం ప్రారంభించాడు. అలాగే కొనసాగుతూ ఉన్నాడు. దీంతో నేను సదరు విలేకరి వైపు తిరిగి.. అతడు (విరాట్) ఎప్పుడు ఆగుతాడు? అని అడిగా. ఎందుకంటే కోహ్లి పెద్ద పదాలతో ఇంగ్లిష్లో అనర్గళంగా మాట్లాడుతూనే ఉన్నాడు. దీంతో ఇదంతా ఇప్పుడు ఎవరు ట్రాన్స్లేట్ చేస్తారు? అని ఆ సమయంలో అనుకున్నా. చివరికి నేను కూడా 'నా సమాధానం కూడా అదే' అని చెప్పేశా. ఎంతో తెలికైన ప్రశ్న కదా.. ఎందుకు విరాట్ అంత భారీ సమాధానం ఇచ్చాడని ఆలోచించా'' అని సర్ఫరాజ్ తెలిపాడు.

**విరాట్ సమాధానం ఇదీ..**

దాయాదుల పోరుపై ఉత్కంఠను ఎలా చూస్తారనే ప్రశ్నకు విరాట్ కోహ్లి ఇచ్చిన సమాధానం ఏంటంటే.. ''భారత్, పాక్ మ్యాచ్ అంటే ఎప్పుడూ ఆసక్తికరంగా ఉంటుంది. అభిమానులు చూసే దృష్టికోణానికి మేం (ఆటగాళ్లం) చూసే విధానానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. మైదానంలోకి అడుగు పెట్టేవరకే భావోద్వేగంతో ఉంటాం. ఎప్పుడైతే మ్యాచ్ కోసం బరిలోకి దిగుతామో ప్రొఫెషనల్ గేమ్ ఆడేందుకు మాత్రమే ప్రయత్నిస్తాం. బౌలర్లు, బ్యాటర్లు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తారు. ఇతర జట్లతో ఆడినట్లే భావించి మరీ బరిలోకి దిగుతాం. అయితే, స్టేడియంలోని అభిమానుల కేరింతలు, అరుపులు మాపై కొంత ఒత్తిడి తీసుకొస్తుందనడంలో సందేహం లేదు. ఇరు జట్ల సభ్యులం ఇలాగే ఫీల్ అయి మ్యాచ్ ఆడతాం'' అని కోహ్లి చెప్పాడు. చివరికి సర్ఫరాజ్ కూడా ''నా సమాధానం కూడా అదే' అని బదులిచ్చేశాడు.

## ఆ జట్టుదే ఐపీఎల్ 16వ సీజన్ టైటిల్: మైకెల్ వాన్



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ మెగా టోర్నీ 16వ సీజన్ ఇవాళ సాయంత్రం నుంచి ప్రారంభం కానుంది. సినీ స్టార్ల ప్రదర్శనలతో నరేంద్ర మోదీ స్టేడియం హోరెత్తనుంది. తొలి మ్యాచ్ గుజరాత్ టైటాన్స్ – చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య జరిగింది. కొత్తగా వచ్చిన గుజరాత్ గతేడాది ఛాంపియన్గా నిలిచిన సంగతి తెలిసిందే. అయితే, ఈసారి ఎవరు విజేతగా నిలుస్తారనేది ఆసక్తిగా మారింది. జట్లలో పెనుమార్పులు చోటు చేసుకోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకెల్ వాన్ టైటిల్ను ఎగరేసుకుపోయే జట్టేదో వెల్లడించాడు. గతేడాది ఫైనల్లో గుజరాత్ చేతిలో ఓటమిపాలైన రాజస్థాన్ రాయల్స్ ఈసారి విజేతగా నిలుస్తుందని జోస్యం చెప్పాడు. ''ఐపీఎల్ మ్యాచ్ల ప్రారంభం కోసం ఆత్రుతగా ఉన్నా. క్రిక్బజ్తో జట్టు కట్టేందుకు ఎదురుచూస్తున్నా. ఈ సంవత్సరం రాజస్థాన్ రాయల్స్దే. ఈసారి ఐపీఎల్ ట్రోఫీని సొంతం చేసుకునే జట్టు రాజస్థాన్'' అని మైకెల్ వాన్ ట్వీట్ చేశాడు. తొలి ఐపీఎల్ టైటిల్ను రాజస్థాన్ రాయల్స్ గెలుచుకున్న విషయం తెలిసిందే. అప్పటినుంచి ఇప్పటి వరకు మరోసారి విజేతగా నిలవలేకపోయింది. గతేడాది ఫైనల్కు చేరినప్పటికీ.. ఉత్కంఠభరితంగా సాగిన ఆ మ్యాచ్లో గుజరాత్ విజయం సాధించి టైటిల్ను ఎగరేసుకుపోయింది. సంజూ శాంసన్ నాయకత్వంలోని రాజస్థాన్ ఈసారి మాత్రం గట్టిపోటీదారుగా ఉంటుందని, టైటిల్ను సాధించే అవకాశం ఉందని మైకెల్ వాన్ తెలిపాడు. తొలిసారి ఇంగ్లాండ్ సీనియర్ ఆటగాడు జో రూట్ ఐపీఎల్లో ఆడబో తున్నాడు. మిడిలార్డర్లో కీలకమవు తాడని రాజస్థాన్ భావిస్తోంది. ఏప్రిల్ 2న హైదరాబాద్ వేదికగా సన్రైజర్స్తో రాజస్థాన్ తొలి మ్యాచ్లో తలపడనుంది.

## 'వరల్డ్ కప్ రేసు' నుంచి లంక అవుట్!




కొలంబో: 1996 వరల్డ్ కప్ ఛాంపియన్స్.. 2007, 2011 ప్రపంచకప్ రన్నరప్.. ఇవీ వన్డే క్రికెట్లో శ్రీలంక సాధించిన అద్భుతాలు. అయితే ఇదంతా గతం. కట్చేస్తే .. 2023 వన్డే వరల్డ్ కప్నకు నేరుగా అర్హత సాధించని జట్టుగా లంక అప్రతిష్టను మూటగట్టుకుంది. అర్జున రణతుంగ, అరవింద డిసిల్వా, సనత్ జయసూర్య, మహేళ జయవర్ధనే, కుమార సంగక్కర, చమిందా వాస్ సహా ఎందరో హేమాహేమీలను అందించిన శ్రీలంక క్రికెట్ ఇప్పుడు కనీసం వన్డే వరల్డ్కప్కు నేరుగా అర్హత సాధించడంలో విఫలమవ్వడం అందరిని విస్మయపరిచింది.44 ఏళ్ల తర్వాత లంక మళ్లీ వన్డే వరల్డ్కప్లో అడుగుపెట్టడం కోసం క్వాలిఫయర్స్ ఆడాల్సిన దుస్థితి ఏర్పడింది. వరుస ఓటములు లంక అవకాశాలను దెబ్బకొట్టాయి. కాగా రెండు టెస్టులు, మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్ల సిరీస్ ఆడేందుకు శ్రీలంక న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లింది.

**అప్పుడలా.. ఇప్పుడిలా అడ్డుకున్న కివీస్**

ఇందులో భాగంగా రెండు టెస్టుల్లో పోరాడి ఓడిన లంక జట్టు.. టీమిండియా–ఆస్ట్రేలియా మధ్య బోర్డర్– గావస్కర్ ట్రోఫీ ఫలితం నేపథ్యంలో ప్రపంచ టెస్టు చాంపియన్షిప్ ఫైనల్ చేరే అవకాశాలను కోల్పోయింది. తొలి మ్యాచ్లో కేవలం రెండు వికెట్లతో ఓటమి పాలైన కరుణ రత్నె బృందం.. రెండో టెస్టులో ఇన్నింగ్స్ 58 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.ఇక శ్రీలంక డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలపై నీళ్లు చల్లిన కివీస్.. తాజాగా వన్డే ప్రపంచకప్లో నేరుగా అడుగుపెట్టే అవకాశం లేకుండా చేసింది. తొలి వన్డేలో 198 పరుగులతో ఘన విజయం సాధించిన న్యూజిలాండ్.. శుక్రవారం నాటి మూడో మ్యాచ్లో 6 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది.

**షనక బృందం అవుట్**

కాగా రెండో వన్డే వర్షం కారణంగా రద్దు కావడంతో సిరీస్ 2–0తో సొంతం చేసుకుంది. దీంతో వన్డే సిరీస్ కోల్పోయిన దసున్ షనక బృందం ప్రపంచకప్–2023 టోర్నీకి నేరుగా అర్హత సాధించే అవకాశం కూడా చేజార్చుకుంది. ఈ క్రమంలో జింబాబ్వేలో జూన్లో జరుగనున్న ఐసీసీ మెన్స్ క్రికెట్ వరల్డ్కప్ క్వాలిఫయర్ ఆడాల్సి ఉంటుంది.కాగా కివీస్తో మూడో వన్డేలో ఓటమితో ఐసీసీ వన్డే సూపర్లీగ్ పాయింట్ల పట్టికలో శ్రీలంక తొమ్మిదోస్థానంలో నిలిచింది. ఇదిలా ఉంటే.. ఎనిమిదో స్థానంలో ఉన్న వెస్టిండీస్కు సౌతాఫ్రికా నుంచి ప్రమాదం పొంచి ఉంది. నెదర్లాండ్స్తో సిరీస్లో సత్తా చాటితే ప్రొటిస్ విండీస్ను వెనక్కినెట్టి రేసులో మరో ముందడుగు వేస్తుంది. కాగా భారత్ వేదికగా అక్టోబరులో వన్డే వరల్డ్కప్–2023 ఈవెంట్ ఆరంభం కానుంది.

# ఆ కల తీరిపోయింది.. ఇక అదే మా లక్ష్యం

## కెప్టెన్ హార్దిక్ పాండ్య



న్యూఢిల్లీ: అత్యంత ప్రజాదరణ పొందిన లీగుల్లో ఐపీఎల్ ముందుంటుంది. ప్రస్తుతం ఐపీఎల్ 16వ సీజన్ సిద్ధమవుతోంది. గతేడాది ఛాంపియన్ గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య మొదటి మ్యాచ్తో మెగా టోర్నీ ప్రారంభం కానుంది. కెప్టెన్ హార్దిక్ పాండ్య నాయకత్వంలోని గుజరాత్ మరోసారి అత్యుత్తమ ప్రదర్శనతో రాణించాలని ఆశిస్తోంది. ఈ క్రమంలో కెప్టెన్ హార్దిక్ తమ జట్టు ప్రయాణం గురించి మాట్లాడిన వీడియోను గుజరాత్ టైటాన్స్ తన యూట్యూబ్ ఛానల్లో ఉంచింది. తమ ప్రాక్టీస్ను, గతేడాది గుజరాత్ సాధించిన విజయాలను, ఈ సీజన్లో ఎలా ఆడాలని అనుకుంటున్నామనే విషయాలను హార్దిక్ తెలిపాడు.''చిన్నప్పుడు నేను క్లాస్రూమ్లో చేసిన పనులకు టీచర్ మా నాన్నకు ఫిర్యాదు చేశారు. హార్దిక్ క్లాస్లో ఎప్పుడూ నిద్రపోతుంటాడని చెప్పారు. అయితే మా నాన్న మాత్రం అలాంటి వాటిని కొట్టిపడేశారు. నేను నిద్ర పోవడం లేదు. కల కంటున్నట్లు చెప్పారు. ఎప్పుడూ కలలు కంటూ ఉంటాడన్నారు. మ్యాచ్లు గెలవాలని, అందరి మనసులను గెలవాలని, భారత్ తరపున ఆడాలని, ఐపీఎల్ విజేతగా నిలవాలని, కెప్టెన్గా టైటిల్ను ఎత్తుకోవాలని.. ఇలా కలలు కనేవాడిని. నాకిష్టమైనవారి మార్గదర్శకంలో ఒకదాని తర్వాత మరొకటి కలలు నెరవేరాయి. గత సీజన్ ముగిసిన సంవత్సరం తర్వాత మళ్లీ ఇక్కడికి (ఐపీఎల్) వచ్చా. నా గుజరాత్ టైటాన్స్ ఫ్యామిలీతో కలిశా. ఆటగాళ్లు, కోచ్, సహాయక సిబ్బంది, మేనేజ్మెంట్ మదిలో ఒకటే విషయం ఇప్పుడు మెదులుతోంది. మనం గతేడాదే ట్రోఫీని గెలిచాం. మన కల నెరవేరింది. మరి ఇప్పుడు ఇంకేం సాధించాలి. గతంలో ఏం జరిగిందనేది గుర్తుంచుకోవాలి. ఐపీఎల్ ట్రోఫీని గెలవడం ప్రతి ఒక్కరి కల. అందులో ఎలాంటి అనుమానం లేదు. అది నెరవేర్చుకున్నాం. అయితే కొనసాగించాల్సిన మరో కీలకమైన విషయం మరొకటి ఉంది. అదే నాణ్యమైన క్రికెట్ను ఆడాలి. ఇలాంటి కలకు ముగింపు ఉండదు. ఇప్పుడు ఇదే లక్ష్యంతో ముందుకు సాగుతాం'' అని హార్దిక్ చెప్పాడు.

## బంగ్లాదేశ్కు షాకిచ్చిన ఐర్లాండ్..



ఛటోగ్రామ్: చటోగ్రామ్ వేదికగా బంగ్లాదేశ్తో జరిగిన మూడో టీ20లో 7వికెట్ల తేడాతో ఐర్లాండ్ సంచలన విజయం సాధించింది. వరుసగా మూడో టీ20లో గెలిచి సిరీస్ను క్లీన్స్వీప్ చేయాలన్న బంగ్లా ఆశలకు ఐరిష్ జట్టు కళ్లెం వేసింది. 125 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్.. మూడు వికెట్లు కోల్పోయి కేవలం 14 ఓవర్లలోనే ఛేధించింది.ఐర్లాండ్ బ్యాటర్లలో పాల్ స్టిర్లింగ్ విధ్వంసం సృష్టించాడు. 41 బంతులు ఎదుర్కొన్న స్టిర్లింగ్ 10 ఫోర్లు, 4 సిక్సర్లతో 77 పరుగులు చేశాడు. ఇక తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ కేవలం 124 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బ్యాటర్లలో షమీమ్ హొస్సేన్(51) మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు.ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అదైర్ మూడు వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించగా.. మాథ్యూ హంఫ్రీస్ రెండు, హాండ్, హ్యారీ టెక్టర్, వైట్, డెలానీ తలా వికెట్ సాధించారు. ఇక తొలి రెండు మ్యాచ్లో విజయం సాధించిన బంగ్లాదేశ్.. మూడు మ్యాచ్ల సిరీస్ను 2–1 తేడాతో సొంతం చేసుకుంది.కాగా టోర్నీ ఆసాంతం అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన బంగ్లా కెప్టెన్ షకీబ్కు ప్లేయర్ ఆఫ్ది మ్యాచ్ అవార్డు లభించింది. కాగా ఐర్లాండ్కు బంగ్లాదేశ్పై 14 ఏళ్ల తర్వాత ఇదే తొలి టీ20 మ్యాచ్ విజయం. బంగ్లాపై చివరగా 2009 టీ20 వరల్డ్కప్లో ఐర్లాండ్ విజయం సాధించింది.

## తారల తళుకుబెళుకులతో ఘనంగా ప్రారంభమైన ఐపీఎల్-16

### చెన్నై, గుజరాత్ మధ్య తొలి మ్యాచ్

అహ్మదాబాద్: అహ్మదాబాద్ నరేంద్ మోదీ స్టేడియంలో ఓపెనింగ్ సెర్మనీ అరిజిత్ సింగ్ గాన మాధుర్యం, తమన్నా, రష్మిక డ్యాన్స్ పెర్ఫార్మెన్స్తొలి మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్ వర్సెస్ చెన్నై సూపర్ కింగ్స్క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఐపీఎల్ 16వ సీజన్ కు తెరలేచింది. అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియంలో ఐపీఎల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ప్రముఖ గాయకుడు అరిజిత్ సింగ్ పఠాన్, బ్రహ్మాస్త్ర తదితర చిత్రాల్లోని గీతాలను ఆలపించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఆ తర్వాత మిల్కీ బ్యూటీ తమన్నా, అందాల రష్మిక మందన్న తమ డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ తో అదరగొట్టారు. పలు హిందీ గీతాలతో పాటు ఊ అంటావా పాటకు తమన్నా ఉత్సాహంగా స్టెప్పులేయగా... ఆ తర్వాత రష్మిక పుష్ప హిట్ సాంగ్స్ తో స్టేడియంలో జోష్ పుట్టించింది. అనంతరం, ఐపీఎల్ ఆరంభ మ్యాచ్ లో తలపడుతున్న చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ కెప్టెన్లు మహేంద్ర సింగ్ ధోనీ, హార్దిక్ పాండ్యాలను ప్రత్యేక శకటాలపై స్టేడియం మధ్యలోని వేదిక వద్దకు తీసుకువచ్చారు. అప్పటికే వేదికపై ఉన్న ఐపీఎల్ పాలకమండలి చీఫ్ అరుణ్ సింగ్ ధుమాల్, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, బీసీసీఐ కార్యదర్శి జై షా.... ఇరు జట్ల కెప్టెన్లకు స్వాగతం పలికారు.



# స్టార్ హీరోల రికార్డులు గల్లంతు



లవ్ స్టోరీలు చేస్తూ హిట్స్ ఇస్తూ పక్కింటి కుర్రాడి ఇమేజ్ తోనే స్టార్ హీరో అయ్యాడు నాని. నేచురల్ స్టార్ నానిగా సినీ అభిమానులతో ప్రేమగా పిలిపించుకునే నాని, ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ అయ్యాడు. కథని నమ్మి, కొత్త దర్శకుడిని నమ్మి, కెరీర్ హైయెస్ట్ బడ్జెట్ తో రిస్క్ చేసిన నానికి సాలిడ్ హిట్ దొరికేసింది. దసరా సినిమాతో ఆడియన్స్ ముందుకి వచ్చిన నాని, మొదటి రోజు సెన్సేషనల్ ఓపెనింగ్స్ ని రాబట్టాడు. ముందు నుంచే అంచనాలు భారీగా ఉండడం, నాని అగ్రెసివ్ గా దసరా సినిమాని ప్రమోట్ చెయ్యడం, స్టెల్లార్ కాస్టింగ్ పెర్ఫార్మెన్స్, హ్యూజ్ టెక్నికల్ సపోర్ట్, రా ఎమోషన్స్, రూటెడ్ స్టోరీ, క్యాచీ సాంగ్స్, డెబ్యు డైరెక్టర్ సాలిడ్ మేకింగ్ ఇన్ని కలిసి దసరా సినిమాని 'ది బెస్ట్' గా మార్చాయి. క్లైమాక్స్ ఇచ్చిన గూస్ బంప్స్ స్టఫ్ నుంచి బయటకి వచ్చిన ఆడియన్స్ అదే టాక్ ని స్ప్రెడ్ చెయ్యడంతో, దసరా ఈవెనింగ్ అండ్ నైట్ షోస్ కంప్లీట్ గా ప్యాక్ అయ్యాయి. దీంతో నాని ఓవరాల్ గా 38 కోట్ల గ్రాస్ ని రాబట్టి సెన్సేషన్ క్రియేట్ చేశాడు. స్టార్ హీరోల రేంజ్ కలెక్షన్స్ ని నాని ఒక కొత్త దర్శకుడితో రాబట్టడం అంటే మాటలు కాదు.ఓవర్సీస్ లో వన్ మిలియన్ ని చేరువలో ఉన్న దసరా సినిమా ఒక మాస్ ఉపోరియానే క్రియేట్ చేసింది. తెలుగు రాష్ట్రాలలోని కొన్ని సెంటర్స్ లో అయితే కొంతమంది స్టార్ హీరోల రికార్డులని దసరా సినిమా బ్రేక్ చేసి, నానిని టైర్-2 నుంచి టైర్ 1 లోకి ఎంటర్ అయ్యేలా చేసింది. ఓవర్సీస్ లో భారి బడ్జెట్ తో రూపొందిన, స్టార్ హీరోల సినిమాలని మించి దసరా సినిమా రాబట్టింది. థియేటర్ బిజినెస్ 50 కోట్ల వరకూ జరిగింది, మొదటి రోజే ఆల్మోస్ట్ సగం రికవర్ అయిపోయింది కాబట్టి బ్రేక్ ఈవెన్ మార్క్ ని రీచ్ అవ్వడానికి దసరా సినిమాకి ఎక్కువ టైం పట్టకపోవచ్చు. రేపు, ఎల్లుండి కూడా వీకెండ్ డేస్ కాబట్టి దసరా బుకింగ్స్ మరింత పెరిగే ఛాన్స్. సో ఇప్పుడున్న ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం దసరా సినిమా మండే నుంచి ప్రాఫిట్స్ లోకి ఎంటర్ అవ్వనుంది. ఎట్లైతే, అట్లయ్యింది చూసుకుందాం అని డేర్ చేసిన నాని మొత్తానికి పాన్ ఇండియా హిట్ ని గుంపగుత్తగా లేపేసాడు.

## బతుకమ్మ పాటలో
# సందడి చేసిన పూజ హెగ్డే!



సల్మాన్ ఖాన్ హీరోగా 'కిసీ కా భాయ్ కిసీ కి జాన్' సినిమా రూపొందింది. ఇది 2014లో అజిత్ చేసిన 'వీరమ్' సినిమాకి రీమేక్. శివ దర్శకత్వం వహించిన ఈ సినిమా, తమిళంలో భారీ విజయాన్ని సాధించింది. అత్యధిక వసూళ్లను సాధించిన అజిత్ సినిమాలలో ఇది ఒకటిగా నిలిచింది. మాస్ యాక్షన్ తో పాటు బలమైన ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న సినిమా ఇది. అలాంటి ఈ సినిమానే సల్మాన్ హీరోగా హిందీలో రీమేక్ చేశారు. ఏప్రిల్ 21వ తేదీన ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయను న్నారు. సల్మాన్ సొంత బ్యానర్లో నిర్మితమైన ఈ సినిమాకి, ఫర్హాద్ దర్శకత్వం వహించాడు. తాజాగా ఈ సినిమా నుంచి ఒక పాటను రిలీజ్ చేశారు. 'బతుకమ్మ' నేపథ్యంలోఈపాట సాగడం విశేషం. సల్మాన్ .. వెంకటేశ్ .. పూజ హెగ్డే .. భూమికపై ఈ పాటను చిత్రీకరించారు. కలర్ఫుల్ గా సాగిన ఈ పాటకి కొరియోగ్రఫీ బాగుంది. జగపతిబాబు.. భాగ్యశ్రీ..మాళవికనాయర్ ముఖ్యమైన పాత్రలను పోషించిన ఈ సినిమా లో,ఒక పాటలో చరణ్ మెరవనుండటం విశేషం.

మనం సినిమా
manamcinema

## ఉస్తాద్ డైరెక్టర్కు పవన్ స్పెషల్ విషెస్



షాక్ సినిమాతో డైరెక్టర్గా టాలీవుడ్లో అడుగుపెట్టాడు హరీష్ శంకర్. మొదటి సినిమానే మంచి థ్రిల్లింగ్ గా తీసి.. పర్వాలేదు అనిపించుకున్నాడు. ఈ సినిమా ఆశించినంత ఫలితాన్ని అయితే అందుకోలేదు కానీ.. హరీష్ కు మంచి అవకాశాలను అందించింది. ఇక హరీష్ కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది గబ్బర్ సింగ్. పవన్ కళ్యాణ్ ఈ సినిమా కన్నా ముందు వరుస ఫ్లాపులతో ఉన్నాడు. ఒక్క హిట్.. ఒకేఒక్క హిట్ కోసం పవన్ అభిమానులు సైతం ఎదురుచూస్తున్న తరుణంలో హరీష్ శంకర్.. గబ్బర్ సింగ్ ను అనౌన్స్ చేశాడు. అప్పటికే హరీష్ రవితేజతో మిరపకాయ్ సినిమా తీసి మంచి మాస్ హిట్ ను అందుకున్నాడు. దీంతో గబ్బర్ సింగ్ పై అంచనాలు ఆకాశాన్నీ తాకాయి. అనుకున్నట్లే ఆ అంచనాలను హరీష్ అందుకున్నాడు. పవన్ కెరీర్ లో బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ తో పాటు భారీ కలక్షన్లను రాబట్టింది గబ్బర్ సింగ్.నేను ట్రెండ్ ఫాలో అవ్వను.. ట్రెండ్ సెట్ చేస్తాను అని పవన్ తోనే ట్రెండ్ సెట్ చేశాడు హరీష్ శంకర్. ఇక ఆ సినిమా తరువాత మళ్లీ పవన్ తో హరీష్ జత కట్టిన సినిమా ఉస్తాద్ భగత్ సింగ్. ప్రస్తుతం ఈ సినిమా సెట్స్ పై ఉంది. త్వరలోనే పవన్ ఈసినిమా షూటింగ్ లో పాల్గొననున్నాడు. ఇకపోతే నేడు హరిశ శంకర్ పుట్టినరోజు. కాగా, పవన్ కళ్యాణ్, తన ఉస్తాద్ డైరెక్టర్ కు స్పెషల్ గా విష్ చేశాడు. ప్రేక్షకుల నాడీ.. నవతరం అభిరుచులు తెలిసిన దర్శకుడు శ్రీ హరీష్ శంకర్. ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. తెలుగు భాష, రచనలపైనా, కళల గురించి చక్కటి అవగాహన ఉన్న దర్శకుడు శ్రీ హరీష్ శంకర్. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను అంటూ ట్వీట్ చేశాడు. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట వైరల్ గా మారింది. మరి ఈ సినిమాతో హరీష్ శంకర్ ఎలాంటి విజయాన్ని అందిస్తాడో చూడాలి.

## అలాంటివాళ్లను చూస్తే నాకు నవ్వొస్తుంది: రవితేజ



ఈ మధ్య కాలంలో ఆసక్తిని రేకెత్తిస్తున్న ప్రాజెక్టుగా రావణాసుర' కనిపిస్తోంది. రవితేజ హీరోగా ఈ సినిమాను సుధీర్ వర్మ రూపొందించాడు. ఈ సినిమా అప్ డేట్స్ చూస్తే, రవితేజ మార్క్కి భిన్నమైన రూట్లో ఈ సినిమా ఉందనే విషయం అర్థమవుతుంది. నెగెటివ్ షేడ్స్ కలిగిన పాత్రను రవితేజ చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఏప్రిల్ 7వ తేదీన ఈ సినిమా రిలీజ్ కావడంతో, ప్రమోషన్స్ తో రవితేజ బిజీగా ఉన్నారు. తాజా ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ... 'గతంలో జరిగిన అవమానాలుగానీ .. ఫెయిల్యూర్ లు గానీ .. సక్సెస్ లుగానీ ఇవేమీ నేను పట్టించుకోను .. గుర్తుపెట్టుకోను. ఆ రోజున నన్ను ఇలా అన్నారు అనేసి ప్రతీకారాలు తీర్చుకునే పనులు పెట్టుకోను' అని అన్నారు. 'చాలామంది చాలా కష్టాలు పడ్డామని చెప్పుకుంటూ ఉంటారు .. అంతకు మించిన కామెడీ మరొకటి లేదు. ఎవరి కోసం ఎవరు కష్టపడ్డారు? .. ఎదగడం కోసం ఎవరి కష్టాలు వారు పడ్డారు. దానివలన వేరే వాళ్లకి ప్రయోజనం ఏముంటుంది? అందుకే అలా చెప్పుకునేవారిని చూస్తే నాకు నవ్వొస్తూ ఉంటుంది' అని చెప్పుకొచ్చారు.

# రామారావు విశ్వరూపానికి సిద్ధమవ్వండి..




ఎన్టీఆర్ 30 అనౌన్స్ చేసిన రోజు నుంచే అంచనాలు భారీగా ఉన్నాయి. ఆచార్య ఫ్లాపైనా దాని ప్రభావం మాత్రం ఈ పై పడకుండా చూసుకుంటున్నారు కొరటాల. పైగా తారక్ కూడా ఈ దర్శకుడిని పూర్తిగా నమ్మేసారు. మార్చ్ 31 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామాగానే ఈ చిత్రం వస్తుంది.ముందు పాన్ ఇండియన్అనుకున్నా.. ఇప్పుడది పాన్ వరల్ మూవీ అవుతుంది. హాలీవుడ్ టెక్నీషియన్స్ ఒక్కొక్కరుగా వచ్చి ఎన్టీఆర్ 30లో జాయిన్ అవుతున్నారు. ఆ మధ్య మిషన్ ఇంపాజిబుల్ స్టంట్ కొరియోగ్రఫర్ కెన్నీ బేట్స్ జాయిన్ అవ్వగా.. ఈ మధ్యే ఆక్వామెన్ సహా చాలా సీ బ్యాక్ డ్రాప్ లకు పని చేసిన వీఎఫ్ఎక్స్ సూపర్వైజర్ బ్రాడ్ మిన్నిచ్ జాయిన్ అయ్యారు. కథ ఎంత బలంగా ఉన్నా.. దాన్ని స్క్రీన్ మీద చూపించడానికి అంతే బలమైన టీం ఉండాలని నమ్ముతున్నారు కొరటాల. అందుకే క్వాలిటీ విషయంలో తగ్గట్లేదీయన. ఈ నేపథ్యంలోనే ఇండియాలోనే బెస్ట్ టెక్నీషియన్స్తో పాటు.. హాలీవుడ్ నుంచి తీసుకొస్తున్నారు. ఇదంతా పాన్ వరల్ స్థాయిలో ౹ాఖీఖ30 విడుదల చేయడానికే అని అర్థమవుతుంది.కొరటాల గత లతో పోలిస్తే ఇందులో హింస కూడా ఎక్కువగానే ఉండబోతుంది. తాజాగా దీనికోసం ఓ ట్యాంకర్ నిండా ఫేక్ బ్లడ్ తీసుకొచ్చారు. ఇప్పటి వరకు తారక్ కెరీర్లోనే లేనంత మాస్ బొమ్మ లోడింగ్ అవుతుందని ఇవన్నీ చూస్తుంటే అర్థమవుతుంది. ఏప్రిల్ 5, 2024న రిలీజ్ కానుంది. జాన్వీ కపూర్ ఇందులో హీరోయిన్.

## బాలీవుల్లో నైతిక విలువలు లోపించాయి: కాజల్



బాలీవుడ్ చిత్ర పరిశ్రమపై కీలక వ్యాఖ్యలు చేశారు నటి కాజల్ అగర్వాల్. బాలీవుడ్లో నైతికత లోపించిందని.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఉన్న విలువలు అక్కడ లేవని అన్నారు. ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కాజల్ 'దక్షిణాది సినిమాలు వర్సెస్ బాలీవుడ్' అనే అంశంపై ఈ మేరకు స్పందించారు. టాలెంట్ ఉంటే దక్షిణాది ప్రేక్షకులు తప్పకుండా అంగీకరిస్తారని అన్నారు.''నేను ముంబయి అమ్మాయిని. పుట్టి, పెరిగిందంతా ఇక్కడే. అయితే.. నా కెరీర్ మొదలైంది హైదరాబాద్లో. తమిళం, తెలుగు సినిమాల్లోనే నేను ఎక్కువగా పనిచేశాను. బాలీవుడ్లో కొన్ని సినిమాలు చేసినప్పటికీ హైదరాబాద్, చెన్నై నగరాలనే నివాసంగా భావిస్తుంటా. అది ఎప్పటికీ మారదు. దక్షిణాది చిత్రపరిశ్రమలో స్నేహపూర్వక వాతావరణం ఉంటుంది. టాలెంట్ ఉంటే ఎవరినైనా ప్రేక్షకులు ఆదరిస్తారు. అద్భుతమైన దర్శకులు, టెక్నీషియన్స్ అక్కడ ఉన్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో మంచి కంటెంట్ వస్తుంటుంది. హిందీ మా మాతృభాష. బాలీవుడ్ సినిమాలు చూస్తూ పెరిగాం. బీటౌన్లోనూ నేను మంచి సినిమాల్లో నటించా. కానీ, దక్షిణాది పరిశ్రమలో ఉన్న నైతికత, విలువలు, క్రమశిక్షణ బాలీవుడ్లో లోపించాయని నేను భావిస్తున్నా'' అని కాజల్ అన్నారు. కాజల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. పలువురు బీటౌన్ అభిమానులు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్మీడియా వేదికగా ట్రోల్స్ చేస్తున్నారు.

## నటిని అవుతానంటే ఇంట్లోవాళ్లు సపోర్ట్ చేయలేదు: మృణాల్ ఠాకూర్



ఇండస్ట్రీలో అడుగుపెడతానంటే కుటుంబసభ్యులు తనకు సపోర్ట్ చేయలేదని నటి మృణాల్ ఠాకూర్ తెలిపారు. పరిశ్రమలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయోనని వాళ్లు భయపడ్డారని ఆమె అన్నారు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈరోజు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు నా తల్లిదండ్రులకు ధన్యవాదాలు చెప్పాలి. ఎందుకంటే, సినిమా పరిశ్రమ, ఇక్కడి వాతావరణంపై వాళ్లకు ఎన్నో భయాలు ఉన్నాయి. దాంతో నేను పరిశ్రమలోకి వస్తానంటే మొదట్లో అంగీకరించలేదు. ఆ తర్వాత వాళ్లకు నా ఇష్టం అర్థమైంది. టీవీ సీరియల్స్లో మంచి పాత్రలు పోషించి, అనంతరం మరాఠీ సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చాను. నేను పోషించే పాత్రల పట్ల ఇంట్లో వాళ్లు సంతోషంగా ఉన్నారు. నా విషయంలో గర్వపడుతున్నారు'' అని ఆమె తెలిపారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sri Vari Printers, D.No: 13-7-954/C1, Korlagunta, Tirupathi-517501, Chittor District (AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet, Guntur (District), AP-522002. CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.